www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -202 ఆదివారం 8 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# సంక్రాంతి తర్వాత జిల్లాల్లో పర్యటిస్తా

## ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే.. రైతులకు సీఎం రేవంత్ కీలక హెచ్చరిక!



**ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులుంటాయని ప్రజలకు అప్రమత్తం**

**రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచన**

**గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరంటూ కేటీఆర్‌పై విమర్శలు**

**కొడంగల్, నవంబర్ 7:,(ప్రజావినికిడి):**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకే సరిపోతాయని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని,**మిగతా 2లో...**

# పల్లెల్లోనూ తగ్గని కూటమి జోరు

## భారీ మెజార్టీతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు కైవసం



**అమరావతి, నవంబర్ 7,(ప్రజావినికిడి):**

పట్టణ స్థానిక సంస్థల్లో క్లీన్‌స్వీప్ చేసిన కూటమి పరిషత్ పోరులోనూ హవా సాగించింది. భారీ మెజార్టీతో జిల్లా, మండల పరిషత్ స్థానాలను కైవసం చేసుకుంది. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. గత రెండున్నరేళ్ల కూటమి పాలన పట్ల ప్రజలు మరోసారి విశ్వసనీయత చాటుకున్నారనేందుకు ఈ ఎన్నికలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఈ నెల 5, 6 తేదీల్లో జరిగిన జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలకు పోలింగ్ జరిగింది. మొత్తం 659 జెడ్పీటీసీ స్థానాలకు గాను 77 ఏకగ్రీవం కాగా 582 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఎంపీటీసీలు మొత్తం 9,818 కాగా 2,051 స్థానాలు ఏకగ్రీవం కాగా 7,707 ఎంపీటీసీ పదవులకు ఎన్నికలు జరిగాయి. శనివారం ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు ప్రకటించారు. కౌంటింగ్ సందర్భంగా పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.**మిగతా 2లో...**

## టీడీపీ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోంది

**ఎమ్మెల్సీపై డెకాయిటీ కేసులా?**

**: చంద్రబాబు సర్కారుపై జగన్ ఫైర్**

**ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అరెస్టును ఖండించిన జగన్**

**బ్యాలెట్ బాక్సుల తరలింపును ప్రశ్నించినందుకు అరెస్టు చేశారని ఆరోపణ**




## ప్రపంచ పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం

**నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో 'సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్'**

**59 దేశాల నుంచి 1250 మందికి పైగా ప్రతినిధుల భాగస్వామ్యం**


**ఏపీలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సమీక్ష**

**వాణిజ్యం, గ్రీన్ ఎనర్జీ సహా ఆరు కీలక రంగాలపై ప్రధానంగా చర్చలు**

**పారిశ్రామిక భాగస్వామ్యాల కోసం 400 బీటుబీ సమావేశాలు**

**విశాఖపట్నం/అమరావతి, నవంబర్ 7: ,(ప్రజావినికిడి):**

విశాఖపట్నం నగరం మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సుకు వేదిక కానుంది. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో 31వ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో జరగనుంది. 'నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్: ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' అనే థీమ్‌తో నిర్వహించే ఈ సదస్సులో 59 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారు.**మిగతా 2లో...**




## ప్రతీ కమతానికి భూధార్ ఇస్తాం

**శాటిలైట్ సర్వేతో భూముల క్రమబద్ధీకరణ**

**రూ.40వేల కోట్లతో 8లక్షల ఇళ్లు నిర్మించాం: పొంగులేటి**






## ఈ 20 కాస్తా 420గా మారింది..

**ఇంధన సంస్థలు ప్రజలను మోసం చేస్తున్నాయి: రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ, (,ప్రజావినికిడి):**

దేశంలోని ప్రధాన చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్‌లో ప్రభుత్వం నిర్దేశించిన 20 శాతం పరిమితికి మించి ఇథనాల్ కలుపుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత,**మిగతా 2లో...**

## కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి

**కొడంగల్ ఎత్తిపోతలలో భారీ అవకతవకలు జరిగాయన్న కేటీఆర్**

**రూ.1450 కోట్ల నుంచి రూ.6825 కోట్లకు ప్రాజెక్టు వ్యయాన్ని పెంచారని విమర్శ**

**ఇది క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అంటూ తీవ్ర విమర్శ**

**హైదరాబాద్ నవంబర్ 7: ,(ప్రజావినికిడి):**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్ –నారాయణపేట–మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని ఆరోపించారు.ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉండగా, దానిని ఇప్పుడు రూ.6,825 కోట్లకు పెంచారని కేటీఆర్ విమర్శించారు.**మిగతా 2లో...**



## ఎమర్జెన్సీ పారపాటే..

**దేశంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించటం పారపాటే.. కానీ తప్పలేదు**


**సంజయ్‌గాంధీ ఒత్తిడితోనే ఆ నిర్ణయం**

**ద హిందూ, ద గార్డియన్ వార్తా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో సోనియాగాంధీ**

**న్యూఢిల్లీ, నవంబర్ 7: ,(ప్రజావినికిడి):**

గత పన్నెండేళ్లలో దేశ సామాజిక నిర్మాణం, ప్రజాస్వామ్య వ్యవస్థలు, రాజ్యాంగ సంస్థలకు తీవ్ర నష్టం జరిగిందని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ వ్యాఖ్యానించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాల వల్ల దేశంలో నెలకొన్న సామాజిక ఐక్యత దెబ్బతింటోందని ఆమె అభిప్రాయపడ్డారు.తన జీవిత అనుభవాలు, రాజకీయ ప్రస్థానం ఆధారంగా రచించిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకంపై ఆమె ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది హిందూ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో**మిగతా 2లో...**





ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ప్రపంచ పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం

**మొదటిపేజీ తరువాయి**

ప్రపంచ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలు, సాంకేతిక నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం.ఈ సదస్సు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు సీఐఐ ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఈ సదస్సు ద్వారా ప్రపంచానికి తెలియజేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. విధాన రూపకర్తలు, పెట్టుబడిదారులు, విద్యాసంస్థలు, అంకుర సంస్థలను అనుసంధానించడం ద్వారా చర్చలను వాణిజ్య, సాంకేతిక భాగస్వామ్యాల దిశగా నడిపించాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు సురక్షితం, సులభతరం అనే భరోసాను ప్రపంచ పారిశ్రామికవేత్తలకు కల్పించాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, సెమికండక్టర్ రంగాల్లో ఉన్న పెట్టుబడి అవకాశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.ఈ సదస్సులో మొత్తం 1,250 మందికి పైగా దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొంటారని అంచనా. వీరిలో 15 మంది విదేశీ మంత్రులు, 40 మందికి పైగా అంతర్జాతీయ వక్తలు, 350 మంది విదేశీ ప్రతినిధులు, 900 మంది భారతీయ ప్రతినిధులు ఉన్నారు. సింగపూర్, నేపాల్, యూఏఈ, కెనడా, ఈజిప్ట్ వంటి అనేక దేశాల నుంచి ప్రభుత్వ ప్రతినిధులు, మంత్రులు హాజరుకానున్నారు. అలాగే, ప్రపంచ ఆహార కార్యక్రమం, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొంటారు.రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఆరు కీలక అంశాలపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. వాణిజ్యం-పెట్టుబడులు, వ్యవసాయం-ఆహార భద్రత, నైపుణ్యాలు-అంతర్జాతీయ ఉపాధి, టెక్నాలజీ-భవిష్యత్ పరిశ్రమలు, స్వచ్ఛ ఇంధనం-సుస్థిర వృద్ధి వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. వ్యాపార సంస్థల మధ్య కొత్త ఒప్పందాలు, భాగస్వామ్యాలను ప్రోత్సహించేందుకు 400కు పైగా బిజినెస్ టు బిజినెస్ (బీటుబీ), ప్రభుత్వాలతో పరిశ్రమల సంప్రదింపుల కోసం బిజినెస్ టు గవర్నమెంట్ (బీటుజీ) సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి కొత్త ఊపు వస్తుందని, రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

# ఈ20 కాస్తా 420గా మారింది..

**మొదటిపేజీ తరువాయి**

ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన ల్యాబొరేటరీ పరీక్షల ఫలితాలను ఉటంకిస్తూ ఆయన శనివారం ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ20 కాస్తా 420గా మారింది ప్రజల కార్ల నుంచి పెట్రోల్ దొంగిలిస్తున్నారు!" అంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా తీవ్రస్థాయిలో విమర్శించారు. చమురు సంస్థల టెస్టింగ్ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆయన ప్రశ్నించారు.కర్ణాటక ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి రిజ్వాన్ అర్షద్ విడుదల చేసిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని ఏడు జిల్లాల నుంచి సేకరించిన 14 పెట్రోల్ శాంపిల్స్‌ను ప్రభుత్వ గుర్తింపు పొందిన ల్యాబ్‌లో పరీక్షించగా, 11 శాంపిల్స్‌లో ఇథనాల్ శాతం 20కి మించి ఉన్నట్లు తేలింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) శాంపిల్‌లో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) శాంపిల్‌లో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి.

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), నయారా ఎనర్జీ, షెల్ వంటి సంస్థల నుంచి సేకరించిన ఇతర శాంపిల్స్‌లో ఇథనాల్ శాతం 25.5 నుంచి 26.5 మధ్య ఉన్నట్లు తేలింది. బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణ, రామనగర, మంగళూరు, తుమకూరు జిల్లాల్లో ఈ శాంపిల్స్‌ను సేకరించారు.అధిక మోతాదులో ఇథనాల్ కలపడం వల్ల వాహనదారుల మైలేజీ తగ్గడమే కాకుండా ఇంజిన్‌లు దెబ్బతినే ప్రమాదం ఉందని మంత్రి రిజ్వాన్ అర్షద్ ఆందోళన వ్యక్తం చేశారు. మొదట ఈ శాంపిల్స్‌ను ఆయిల్ కంపెనీల ల్యాబ్‌లకు పంపగా, వారు ఇథనాల్ శాతం వివరాలు వెల్లడించలేదని, అందుకే స్వతంత్ర ల్యాబ్‌లో పరీక్షలు చేయించాల్సి వచ్చిందని ఆయన వివరించారు.

**ఆరోపణలను ఖండించిన చమురు సంస్థలు**

అయితే, కర్ణాటక ప్రభుత్వం, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సహా అన్ని చమురు మార్కెటింగ్ కంపెనీలు తీవ్రంగా ఖండించాయి. శాంపిల్స్ సేకరణ, పరీక్షా విధానాలు నిర్దేశిత చట్టబద్ధమైన మార్గదర్శకాల ప్రకారం జరగలేదని ఆక్షేపించాయి. తాము దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 893 శాంపిల్స్‌తో జాయింట్ క్వాలిటీ మానిటరింగ్ నిర్వహించామని, అందులో కర్ణాటకకు చెందిన 56 శాంపిల్స్ కూడా ఉన్నాయని తెలిపాయి.

ఈ పరీక్షల్లో ఇథనాల్ శాతం 19 నుంచి 21 శాతం మధ్యలోనే ఉందని, కర్ణాటక శాంపిల్స్‌లో సగటున 19.3 శాతంగానే నమోదైందని స్పష్టం చేశాయి. ఈ తాజా వివాదంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం, దాని ప్రభావంపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. వాహనాల పనితీరు, వినియోగదారులపై పడుతున్న భారంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# పల్లెల్లోనూ తగ్గని కూటమి జోరు

**మొదటిపేజీ తరువాయి**

చెదురుమదురు సంఘటనలు మినహా కౌంటింగ్ ప్రక్రియ సాఫీగా సాగిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.

ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కాగా వివిధ జిల్లాల్లో అర్ధరాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. కొన్ని ప్రాంతాల్లో లెక్కింపు జరుగుతుండగా, మరికొన్ని స్థానాలకు సంబంధించి పోస్టల్ ఓట్లను లెక్కిస్తున్నారు. దీంతో పూర్తిస్థాయి ఫలితాల వెల్లడిలో జాప్యం చోటుచేసుకుంది.

## కూటమి ప్రభంజనం!

పరిషత్ పోరులో కూటమి తన ప్రభంజనాన్ని కొనసాగించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఫలితాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ తమ స్పష్టమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి. ప్రధానంగా టీడీపీ, జనసేన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో విజయాన్ని అందుకున్నారు.

రాత్రి 11 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు కూటమి ప్రస్తుతం ఎన్నికలు జరిగిన 582 జెడ్పీటీసీ స్థానాల్లో 186 స్థానాలను కైవసం చేసుకుంది. వైసీపీ కేవలం 86 స్థానాలకు మాత్రమే పరిమితం అయింది. మరో రెండు స్థానాల్లో ఇండిపెండెంట్లు విజయం సాధించారు.

ఎంపీటీసీ ఫలితాల్లో కూడా కూటమిదే పైచేయి అయింది. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష వైసీపీ తన ఉనికిని చాటుకుంది. ప్రస్తుతం ఎన్నికలు జరిగిన స్థానాల్లో 6,952 స్థానాల్లో కూటమి విజయకేతనం ఎగురవేసింది. ఇక ప్రతిపక్ష వైసీపీ 1,500 ఎంపీటీసీ స్థానాలను సాధించి తన ఉనికిని చాటుకుంది. మరో 254 స్థానాల్లో వామపక్షాలతో పాటు ఇండిపెండెంట్లు విజయం సాధించారు.

ఇప్పటి వరకు వెల్లడైన ఫలితాల ప్రకారం టీడీపీ 336 జెడ్పీటీసీ స్థానాలు దక్కగా, మరో 47 చోట్ల ఆధిక్యంలో ఉంది. జనసేన ఇప్పటి వరకు 61 జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోగా మరో 6 చోట్ల లీడ్‌లో ఉంది. బీజేపీ 18 జెడ్పీటీసీ స్థానాల్లో విజయం సాధించగా, మరో రెండు చోట్ల ఆధిక్యం ప్రదర్శిస్తోంది.

వైసీపీ 86 జెడ్పీటీసీ స్థానాలను సాధించగా మరో 11 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. రెండు చోట్ల ఇండిపెండెంట్లు విజయం సాధించారు.

ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఏకగ్రీవాలతో కలిపి వెల్లడించిన 9,817 ఫలితాల్లో 6,842 స్థానాల్లో టీడీపీ విజయకేతనం ఎగురవేసింది. జనసేనకు 811, బీజేపీకి 181 ఎంపీటీసీ స్థానాలు దక్కాయి. ఇక ప్రతిపక్ష వైసీపీ 1,500 స్థానాల్లో విజయాన్ని నమోదు చేసింది. మరోవైపు 240కి పైగా స్థానాల్లో ఇండిపెండెంట్లు, వామపక్షాలు పాగా వేశాయి.

**పులివెందులలో జగన్‌కు మళ్లీ షాక్!**

స్థానిక ఎన్నికల ఫలితాలే పులివెందులలో మళ్లీ పునరావృతమయ్యాయి. వైసీపీ అధినేత సొంత నియోజకవర్గం పులివెందులలో పరిషత్ పోరులోనూ కూటమి పాగా వేసింది. పులివెందుల జెడ్పీటీసీ స్థానంతో పాటు ఆ నియోజకవర్గంలోని అత్యధిక ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకుని జగన్‌కు షాక్ ఇచ్చింది.

పరిషత్ పోరులో జనసేనకు భంగపాటు తప్పలేదు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం ఎమ్మెల్యే బత్తుల రామకృష్ణ సతీమణి వెంకటలక్ష్మి సీతానగరం జెడ్పీటీసీగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఇక్కడ వైసీపీ అభ్యర్థి ఆమెపై 2,600 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ మండలంలో వైసీపీ అత్యధికంగా గెలవడం మరో విశేషం.

**బొత్సకు మిశ్రమ ఫలితం.. కళాకు చేదు అనుభవం**

విజయనగరం జిల్లాలో వైసీపీ, టీడీపీ సీనియర్ నేతలకు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. బొత్స సత్యనారాయణ కుమార్తె అనూష పరాజయం పాలవగా, కోడలు బొత్స పూజిత మాత్రం విజయం సాధించింది. ఇక టీడీపీ సీనియర్ నేత కళా వెంకట్రావుకు పరిషత్ పోరులో చేదు అనుభవం ఎదురైంది. గరివిడి జెడ్పీటీసీ స్థానంలో ఆయన కోడలు బరిలోకి దిగగా వైసీపీ అభ్యర్థి బొత్స కోడలు పూజిత చేతిలో పరాజయం చెందారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపులో పలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. రాయలసీమ జిల్లాల్లో స్వల్ప ఘర్షణలు, వాగ్వివాదాలు జరిగాయి. తిరుపతి, అనంతపురం జిల్లాల్లో కౌంటింగ్ కేంద్రాల వద్ద వాగ్వివాదాలకు దిగిన పరిస్థితులు కనిపించాయి. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించడంతో కౌంటింగ్ ప్రక్రియ యథావిధిగా కొనసాగింది.

ఇదిలా ఉండగా పరిషత్ పోరులో పల్నాడు, అనకాపల్లి జిల్లాల్లో కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. అనకాపల్లి జిల్లాలో 24 జెడ్పీటీసీ స్థానాలకు గానూ 24 స్థానాల్లో కూటమి విజయం సాధించి రికార్డు సృష్టించింది. ఇక పల్నాడు జిల్లాలో 28 జెడ్పీటీసీ స్థానాలకు గానూ 28 స్థానాలు కూటమి హస్తగతం చేసుకుని వైసీపీని మట్టికరిపించింది.

**రికార్డు స్థాయి మెజార్టీలు**

పరిషత్ పోరులో అభ్యర్థులు పలు భారీ మెజార్టీ విజయాలను నమోదు చేశారు. గత ఎన్నికల రికార్డులను సైతం బద్దలు కొట్టారు.

పల్నాడు జిల్లా నకరికల్లు మండలంలో టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థి డాక్టర్ నాగోతు వెంకట సుబ్బారావు 32,919 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. రాష్ట్రంలోనే ఇది అత్యధిక మెజార్టీ విజయం.

పల్నాడు జిల్లా పెదకూరపాడు జెడ్పీటీసీ స్థానం కోసం బరిలోకి దిగిన జనసేన అభ్యర్థి శ్రీనివాసరావు 30,273 ఓట్ల తేడాతో వైసీపీ అభ్యర్థిపై విజయం సాధించారు.

పల్నాడు జిల్లా నూజెండ్ల మండలంలో జెడ్పీటీసీ స్థానం కోసం పోటీ చేసిన జనసేన అభ్యర్థి శింగంశెట్టి వెంకట బాల ప్రసాద్ 28,863 ఓట్ల మెజార్టీతో విజయకేతనం ఎగురవేశారు.

# ప్రతీ కమతానికి భూధార్ ఇస్తాం

## శాటిలైట్ సర్వేతో భూముల క్రమబద్ధీకరణ

## రూ.40వేల కోట్లతో 8లక్షల ఇళ్లు నిర్మించాం: పొంగులేటి

**షాద్‌నగర్/నందిగామ, నవంబరు 7,(ప్రజావినికిడి):**

"భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా శాటిలైట్ సర్వే నిర్వహించి.. భూములను క్రమబద్ధీకరిస్తాం. పట్టాదార్ పాస్ బుక్‌లో నక్ష మ్యాప్‌ను జతచేసి ప్రతీ కమతానికి భూధార్ నంబర్ ఇస్తాం. రాష్ట్రవ్యాప్తంగా నిరుపేదలకు రూ.40 వేల కోట్లతో 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇచ్చాం" అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలో రూ. కోటితో నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ భవనం, హైమాస్ట్ లైట్లను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు.అలాగే మండల తహసీల్దార్ కార్యాలయం, డ్వాక్రా భవన నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ దొరల పాలనలో రూ.8.23లక్షల కోట్ల అప్పులు చేశారని, ఆ అప్పులకు ప్రతీనెల రూ.6,500 కోట్లు వడ్డీ చెల్లిస్తూనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ధరణిని తీసుకువచ్చి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని, ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత ధరణిని బంగాళాఖాతంలో కలిపి భూ భారతి చట్టం తీసుకువచ్చి భూ సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ప్రతీ జిల్లాలో మొదటి విడతలో 70 గ్రామాలను సర్వే చేయించామని తెలిపారు. వచ్చే ఏడాదిన్నర కాలంలో 10,486 గ్రామాల్లో సర్వే చేయిస్తామని తెలిపారు.







# కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి

**మొదటిపేజీ తరువాయి**

రైతులకు ఇంకా చుక్క నీరు అందకముందే, అంచనా వ్యయాన్ని దాదాపు ఐదు రెట్లు పెంచి రాష్ట్ర సంపదను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియలో మంత్రి పొంగులేటి కంపెనీ ప్రధాన పోటీదారుగా ఉందని, మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులేనని ఆయన ఆరోపించారు.

ఈ వ్యవహారంపై కేటీఆర్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అనే పదాలు కూడా ఈ దోపిడీ ముందు చాలా చిన్నవి అయిపోతున్నాయి. రాహుల్ గాంధీ గారూ.. ఈ దోపిడీని వర్ణించడానికి దయచేసి ఏదైనా కొత్త పదాన్ని వెతకడంలో నాకు సహాయం చేయండి" అని అన్నారు.ప్రజల అవసరాలను పక్కనపెట్టి, ప్రాజెక్టుల పేరుతో అంచనాలు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు కట్టబెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.

# ఎమర్జెన్సీ పారపాటే..

**మొదటిపేజీ తరువాయి**

ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజాస్వామ్య విలువలు, లౌకికవాదం, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు తదితర అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష పార్టీలకు సమాన అవకాశాలు లభించడం లేదని సోనియాగాంధీ ఆరోపించారు. ఎన్నికల సంఘం సహా పలు సంస్థలపై ప్రభుత్వ ప్రభావం ఉందని, ప్రధాన మీడియా, ఆర్థిక వనరులను అధికార పక్షం తనకు అనుకూలంగా వినియోగించుకుంటోందని విమర్శించారు.

ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ ఉండాలని ఆమె పేర్కొన్నారు. మతం, విశ్వాసం ఆధారంగా ప్రజల మధ్య విభేదాలు సృష్టించకూడదని, లౌకికవాద విలువలను కాపాడాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందన్నారు.1975-77 మధ్య విధించిన ఎమర్జెన్సీ గురించి కూడా ఆమె ప్రస్తావించారు. ఆ సమయంలో ప్రజాస్వామ్య హక్కులు పరిమితమయ్యాయని, జరిగిన పరిణామాలపై వెనక్కి తిరిగి చూసినప్పుడు వాటి తీవ్రత అర్థమవుతుందని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ కాలంలో జరిగిన తప్పిదాలపై ఇందిరాగాంధీ అనంతరం విచారం వ్యక్తం చేశారని గుర్తుచేశారు.రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీల నుంచి ధైర్యం, సానుభూతి, లౌకికవాదం, ప్రజాస్వామ్యంపై నిబద్ధత వంటి విలువలను నేర్చుకున్నానని సోనియాగాంధీ తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను తిరిగి బలోపేతం చేయడానికి రాజకీయ పార్టీలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితులపై ప్రజల్లో అసహనం పెరుగుతోందని, అయినప్పటికీ దేశ భవిష్యత్తుపై తాను ఆశావాదంతో ఉన్నానని ఆమె పేర్కొన్నారు.

# టీడీపీ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోంది

## : చంద్రబాబు సర్కారుపై జగన్ ఫైర్

**అమరావతి, నవంబర్ 7: ,(ప్రజావినికిడి):**

వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అరెస్టును ఆ పార్టీ అధినేత జగన్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల అక్రమాలను ప్రశ్నిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన వారిపై తప్పుడు కేసులు బనాయించి, నిర్బంధించడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎమర్జెన్సీని తలపించే పాలన నడుస్తోందని, ఇది అత్యంత హేయమని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా విమర్శించారు.

గురువారం పరిషత్ ఎన్నికల పోలింగ్ ముగిశాక, గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం నుంచి నాగార్జున యూనివర్సిటీలోని స్ట్రాంగ్‌రూమ్‌కు వెళ్లాల్సిన బ్యాలెట్ బాక్సులను మధ్యలో నల్లపాడు వద్ద ఎందుకు దించారని జగన్ ప్రశ్నించారు. ఈ అక్రమాన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై లాఠీఛార్జ్ చేయడం దారుణమన్నారు. తప్పు చేసి, బ్యాలెట్ బాక్సులు మార్చే ప్రయత్నం చేస్తూ, మళ్లీ తమ వారిపైనే అక్రమ కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా ఒక ఎమ్మెల్సీపై డెకాయిటీ, దొంగతనం కేసులు పెట్టడం కంటే దుర్మార్గం ఏముంటుందని నిలదీశారు.ఈ సందర్భంగా చంద్రబాబును ఉద్దేశించి, "ఈ స్థానిక ఎన్నికల్లో నామినేషన్ల నుంచి బ్యాలెట్ బాక్సుల వరకు అన్నింటినీ రిగ్గింగ్ చేస్తున్నారు. ఈ రకంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే, ప్రశ్నించిన వారిని అరెస్టు చేసి జైలుకు పంపుతారా? అధికార, పోలీసు బలంతో అక్రమాలు దాచిపెట్టలేరు. మీ అప్రజాస్వామిక పద్ధతులను దేశమంతా చూస్తోంది. ప్రజలు మీకు తగిన బుద్ధి చెబుతారు" అని జగన్ తన ట్వీట్‌లో హెచ్చరించారు.

# సంక్రాంతి తర్వాత జిల్లాల్లో పర్యటిస్తా



**మొదటిపేజీ తరువాయి** , అందరం కలిసికట్టుగా పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు.సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని సీఎం ప్రకటించారు. మూడు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు.ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉంటే తెలంగాణలోనే కరవు వచ్చినట్లు బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని రేవంత్ విమర్శించారు. బావబామ్మర్దులు ఊళ్లపై పడి అబద్ధాలు చెబుతారని, వారి మాటలు విని రైతులు నష్టపోవద్దని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరారు.

మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోసుకోకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు వెళ్తున్నాయన్న బీఆర్ఎస్ ఆరోపణల్లో నిజం లేదని సీఎం అన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి నుంచి ఎత్తిపోసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు దించే పరిస్థితి కూడా లేదన్నారు. బీఆర్ఎస్ అవినీతి వల్లే ఈ మూడు బ్యారేజీలు పనిచేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన దేవాదుల, వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్టులే ప్రస్తుతం రైతులకు, ఖమ్మం జిల్లాకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.పాలమూరు నుంచి గెలిచిన కేసీఆర్ భారీ బడ్జెట్ ఖర్చు చేసినా అక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని రేవంత్ విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి పేరు, స్థలం, అంచనాలు మార్చి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలోనే కూలిపోయిందని ఆరోపించారు. వచ్చే డిసెంబరులో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు స్పీకర్ అనుమతి కోరుతున్నామని, ఆ సమావేశాల్లో ఎల్‌నినో, కాళేశ్వరం అంశాలపై చర్చించేందుకు సిద్ధమని సవాల్ విసిరారు.కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం అంచనాలు పెంచడంపై కేటీఆర్ చేస్తున్న విమర్శలకూ సీఎం సమాధానమిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొడంగల్ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షలు ఇచ్చేందుకు కూడా కేసీఆర్ ప్రభుత్వం ముందుకు రాలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం ఇస్తోందన్నారు. హైదరాబాద్-లగచర్ల ప్రాంతాన్ని ఢిల్లీ-నోయిడా తరహాలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. హకీంపేటలో 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.కేటీఆర్ వేషభాషలు మార్చుకున్నా ప్రజలు నమ్మరని రేవంత్ ఎద్దేవా చేశారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరని వ్యాఖ్యానించారు. తాను మూడేళ్లుగా గంట కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానని చెప్పారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని, అబద్ధాలు ప్రచారం చేస్తున్న కుటుంబాన్ని ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

ఆదివారం 8 నవంబర్ 2026

# కాలేశ్వరం పేరుతో పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం

**లక్ష కోట్లతో కాలేశ్వరం నిర్మించి, ప్రాణహిత-చేవెళ్ల డీపీఆర్‌ను మార్చి పాలమూరుకు అన్యాయం**

**కుర్చీ వేసుకొని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మిస్తామని మాట తప్పిన మీ మామ కేసీఆర్**

**మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలకు బక్కని నరసింహులు కౌంటర్**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**మాజీ మంత్రి హరీష్‌రావు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై చేసిన వ్యాఖ్యలకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు ప్రాంత సాగునీటి ప్రాజెక్టుల విషయంలో జరిగిన పరిణామాలను గుర్తు చేస్తూ హరీష్‌రావు వ్యాఖ్యలను ఆయన ప్రశ్నించారు.

**హరీష్ రావు రాజకీయా ప్రయోజనాల కోసం అపోహలు సరికావు..**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నీళ్లను కుప్పంకుతరలించుకుపోయారంటూ మాజీ మంత్రి,బీఆర్ఎస్ నేత హరీష్‌రావు పదేపదే వ్యాఖ్యలు చేయడం సరికాదని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అపోహలు సృష్టించే విధంగా మాట్లాడటం తగదని ఆయన పేర్కొన్నారు. మీడియా సమావేశంలో బక్కని నరసింహులు మాట్లాడుతూ, నీటి అంశం రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల జీవనాధారంతో ముడిపడి ఉన్న కీలకమైన విషయమని అన్నారు. ఇలాంటి సున్నితమైన అంశాలపై మాట్లాడేటప్పుడు వాస్తవాలు, ఆధారాలతో మాట్లాడాలని సూచించారు. చంద్రబాబుపై పదేపదే విమర్శలు చేయడం ద్వారా నీటి సమస్యలకు పరిష్కారం లభించదని పేర్కొన్నారు. లక్ష కోట్ల రూపాయలతో కాలేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన కేసీఆర్ ప్రభుత్వం,ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు డీపీఆర్‌ను మార్చి పాలమూరు ప్రాంతానికి అన్యాయం చేసిందని బక్కని నరసింహులు విమర్శించారు. పాలమూరు ప్రజల సాగునీటి కలలను సాకారం చేయాల్సిన బాధ్యతను గత ప్రభుత్వం విస్మరించిందని అన్నారు.

**లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్ట్ ను విస్మరించిన కేసీఆర్**

ముఖ్యంగా లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం విషయంలో కేసీఆర్ ఇచ్చిన హామీని ఆయన గుర్తుచేశారు. కుర్చీ వేసుకొని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని చెప్పిన మీ మామ కేసీఆర్ ఆ మాటను నిలబెట్టుకోలేదు అంటూ హరీష్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారుపాలమూరు ప్రజలకు సాగునీరు అందిస్తామని హామీలు ఇచ్చి,ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యం వహించిన గత పాలకులు ఇప్పుడు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పాలమూరు ప్రాంత ప్రజల సాగునీటి సమస్యలు, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి,రైతులకు నీటి అందుబాటు వంటి అంశాలపై రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా వాస్తవాల ఆధారంగా మాట్లాడాలని బక్కని నరసింహులు పేర్కొన్నారు

# నూతనంగా జడ్జిగా ఎంపికైన ఆగిరు లక్ష్మీ ప్రసాద్‌కు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అభినందనలు



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**పట్టణానికి చెందిన ఆగిరు లక్ష్మీ ప్రసాద్ నూతనంగా జడ్జిగా ఎంపిక కావడంతో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ శనివారం ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసాద్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.న్యాయమూర్తిగా ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ,భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్,బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు నటరాజన్,కౌన్సిలర్ ఎస్పీ శివ,మాజీ కౌన్సిలర్లు వెంకట్రాంరెడ్డి,నందకిషోర్,నాయకులు చీపిరి రవియాదవ్,జమాల్ ఖాన్,శివాజీ నాయక్,సాయి యాదవ్, వెంకటేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# జాకారం గ్రామంలో ఇందిరమ్మ ఇంట్లో తొలి దీపావళి సంబరాలు

**లబ్ధిదారులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** నియోజకవర్గంలోని జిల్లేడు చౌదరిగుడా మండలంలోని జాకారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ సొంతింట్లో తొలి దీపావళి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు మండల పార్టీ అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి ఇందిరమ్మ ఇంటి ముందు దీపాలు వెలిగించి పండుగ సంబరాలు చేసుకున్నారు. సొంతింటి కల నెరవేరిన ఆనందాన్ని కుటుంబ సభ్యులతో పంచుకున్నారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ కుటుంబాలతో కలిసి ఫొటోలు తీసి ఇందిరమ్మ ఇండ్లు యాప్‌లో,సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్‌తో పాటు ప్రదీప్,గోపాల్, వెంకటయ్య, మహేష్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు

# పాపిరెడ్డిగూడలో మళ్లీ రెచ్చిపోయిన మట్టి మాఫియా..

## గ్రామస్తులు అడ్డుకున్నా ఆగని దందా.. మట్టి దోపిడీకి అడ్డుకట్ట పడేదెప్పుడు.?

## అధికారులంటే భయం లేదు.. చట్టాలంటే లెక్కలేదు..



అక్రమ మట్టి తవ్వకాలకు వినియోగిస్తున్న వాహనాలు

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** నియోజకవర్గంలోని కేశంపేట మండలంలో అక్రమ మట్టి మాఫియా ఆగడాలు మళ్లీ హద్దులు దాటుతున్నాయి. అధికారుల నిఘా,చట్టాలన్నా కనీస భయం లేకుండా ప్రభుత్వ భూములను కొల్లగొట్టడమే లక్ష్యంగా అక్రమార్కులు యథేచ్ఛగా తమ దందాను సాగిస్తున్నారు.మండలంలోని పాపిరెడ్డిగూడ గ్రామ శివారులో విలువైన ప్రభుత్వ భూములే లక్ష్యంగా ఈ అక్రమ తవ్వకాలు, రవాణా దర్జాగా సాగుతుండటం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

**గ్రామస్తుల ప్రతిఘటన.. అయినా బెదరని అక్రమార్కులు..**

గతంలోనూ ఈ ప్రాంతం నుండి పెద్ద ఎత్తున మట్టిని అక్రమంగా తవ్వి తరలించిన దాఖలాలు ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం గ్రామ శివారులో అక్రమంగా మట్టి తరలిస్తుండగా స్థానిక గ్రామస్తులు ఐక్యంగా నిలబడి,తీవ్రంగా ప్రతిఘటించి వాహనాలను అడ్డుకోవడంతో ఈ తవ్వకాలకు బ్రేక్ పడింది. అయితే,ఆ వ్యవహారం సద్దుమణిగిందనుకునే లోపే, అదే ముఠా మళ్లీ వాహనాలను రంగంలోకి దించి శనివారం యథేచ్ఛగా తవ్వకాలు, రవాణాను మొదలుపెట్టింది. స్థానికులు మరోసారి అడ్డుకుని నిలదీసినప్పటికీ,అక్రమార్కులు ఏమాత్రం లెక్కచేయకుండా దర్జాగా తమ దందాను కొనసాగిస్తుండటం వారి తెగింపునకు నిదర్శనంగా నిలుస్తోంది.

**అధికారుల సీజింగ్‌లు తాత్కాలికమేనా,మట్టి మాఫియా వెనక అదృశ్య శక్తులు ఎవరు.**

ఈ మట్టి మాఫియా ఆగడాలకు అధికారులన్నా,మైనింగ్ చట్టాలన్నా కనీస భయం లేకుండా పోయింది. అధికారులు అప్పుడప్పుడు కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తున్నా, అక్రమార్కులు కొద్దిరోజులు మిన్నకుండి మళ్లీ అదే పనికి ఒడిగడుతున్నారు.కేవలం నామమాత్రపు జరిమానాలతో సరిపెడుతుండటమే ఈ ముఠాల తెగింపునకు కారణమని తెలుస్తోంది. అధికారుల నిఘా ఉన్నా, గ్రామస్తులు ఎదురుతిరిగినా ఆగడం లేదు..వీరి వెనుక ఉన్న అదృశ్య శక్తులు ఎవరు..అని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**క్రిమినల్ కేసులు పెట్టాలని గ్రామస్తుల డిమాండ్..**

ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతూ, అధికారులకే సవాల్ విసురుతున్న ఈ మట్టి మాఫియాపై ఇకనైనా కఠిన చర్యలు తీసుకోవాలని పాపిరెడ్డిగూడ గ్రామస్తులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. కేవలం వాహనాలపై నామమాత్రపు జరిమానాలు విధించి చేతులు దులుపుకోకుండాగతంలోనూ, ఇప్పుడూ ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరుపుతున్న ప్రధాన సూత్రధారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు. అలాగే ప్రభుత్వ భూముల చుట్టూ రక్షణ చర్యలుచేపట్టాలని రెవెన్యూ, పోలీస్,మైనింగ్ ఉన్నతాధికారులను గ్రామస్తులు వేడుకుంటున్నారు.



# అక్రమ గంజాయి సరఫరా ఒడిశా టూ ముంబై వయా హైదరాబాద్

**అన్నోజిగూడ లో 30 లక్షల విలువ చేసే 60 కిలోల గంజాయి స్వాధీనం**

**ముంబయికి అక్రమంగా గంజాయి సరఫరా చేస్తున్న ముఠా అరెస్ట్**





**ఘట్‌కేసర్,(ప్రజావినికిడి):** ఒడిశా నుంచి హైదరాబాద్ మీదుగా దేశ ఆర్థిక రాజధాని ముంబయికి సాగుతున్న అంతర్రాష్ట్ర గంజాయి అక్రమ రవాణా ముఠా గుట్టును మల్కాజిగిరి పోలీసులు రట్టు చేశారు.మల్కాజిగిరి పోలీస్ కమీషనరేట్ పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ ఔటర్ రింగ్ రోడ్ సర్వీస్ రోడ్ వద్ద జరిపిన తనిఖీల్లో ముప్పై లక్షల విలువైన అరవై కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. ఎల్బీనగర్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీసీపీ బి.అనురాధ వివరాలను మీడియా కు వెల్లడించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, హైదరాబాద్ బండ్లగూడ, చాంద్రాయణగుట్ట ప్రాంతాలకు చెందిన మహమ్మద్ అమెర్ (28), మహ్మద్ ఇమ్రాన్ ఉద్దీన్ (35) లు ఒడిశాకు చెందిన పూర్ణచంద్ర మొహపాత్ర నుంచి కిలో ఏడు వేల చొప్పున గంజాయి కొనుగోలు చేసి, ముంబయిలోని ధారవికి చెందిన యాస్మిన్ చంద్ సయ్యద్‌కు కిలో పదిహేను వేల చొప్పున విక్రయించేందుకు తీసుకెళ్తున్నారని అన్నారు.తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం రోజు ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్ బృందం, పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అన్నోజిగూడ ఔటర్ రింగ్ రోడ్ సర్వీస్ రోడ్ వద్ద ఉన్న మసాలా కంపెనీ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు.ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన మారుతీ సుజుకీ ఎస్ఎక్స్4 కారును ఆపి తనిఖీ చేయగా వెనుక సీటు వెనుక భాగంలో దాచిన అరవై ప్యాకెట్ల గంజాయి లభించిందని అన్నారు.వారి వద్ద అరవై కిలోల గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన కారును,రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్ కు తరలించినట్లు డీసీపీ అనురాధ తెలిపారు.కాగా నిందితుడు అమెర్‌పై గతంలో ఐదు ఎన్‌డీపీఎస్ కేసులు కాగా, ఇమ్రాన్‌పై నాలుగు కేసులు నమోదయ్యాయని,పరారీలో ఉన్న గంజాయి సరఫరాదారు పూర్ణచంద్ర మొహపాత్ర, ముంబయిలో సరుకు స్వీకరించాల్సిన యాస్మిన్ చంద్ సయ్యద్ కోసం పోలీసులు గాలిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎస్ఓటి డీసీపీ మనోహర్, ఎస్ఓటి అడిషనల్ డిసిపి షాకీర్ హుస్సేన్, ఉప్పల్ జోన్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ, మేడిపల్లి ఏసీపీ మోహన్‌కుమార్, పోచారం ఐటీ కారిడార్ ఇన్‌స్పెక్టర్ జి.జగన్నాథ్, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ కె.ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంబర్ పేటలో పాద యాత్ర నిర్వహించిన ఎమ్మెల్యే

**అంబర్ పేట్, (ప్రజావినికిడి):**



అంబర్ పేట్ డివిజన్ పటేల్ నగర్ చౌరస్తా నుంచి ప్రేమ్ నగర్ బేగం అమ్మ గల్లీలో పాదయాత్రను అంబర్ పేట్ నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, అంబర్ పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ తో కలసి ప్రేమ్ నగర్ లోని సమస్యలపై సంబంధిత అధికారులతో కలిసి ప్రేమ్ నగర్ బేగం అమ్మ గల్లీలో ఉన్నటువంటి కలుషిత మంచినీటి సమస్యని పరిశీలించి వెంటనే సమస్యని పరిష్కరించాలని సమస్య పరిష్కారం కొరకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి దీపావళి పండుగ అయిపోయిన వెంటనే సమస్యని పరిష్కరించాలనికలుషిత మంచినీటి సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే నూతన సిసి రోడ్డు ఏర్పాటు కొరకు వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రేమ్ నగర్ లో ఇంటింటికి తిరుగుతూ సమస్యలని తెలుసుకొని పరిష్కరించాలని సంబంధిత అన్ని శాఖల అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో డీజీఎం కృష్ణ,డిఈ ప్రవీణ్,ఏఈ పవన్,ఏఈ నజీర్,వర్క్ ఇన్స్పెక్టర్ దుర్గ, రమేష్, వీధిదీపాల సిబ్బంది సాయి, పారిశుద్ధ సిబ్బంది, బిఆర్ఎస్ పార్టీ అంబర్పేట్ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జాఫర్,పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు,మహిళా నాయకులు మైనార్టీ నాయకులు స్థానిక బస్తి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# తాళం వేసిన ఇళ్లే టార్గెట్..

## చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

**ఈశ్వర్ కాలనీ దొంగతనం కేసును ఛేదించిన షాద్‌నగర్ పోలీసులు**

**బంగారు,వెండి ఆభరణాలు స్వాధీనం..**

**నిందితుడిని రిమాండ్**

**వివరాలను వెల్లడించిన సిఐ సీతారాం**






**షాద్ నగర్.(ప్రజావినికిడి):**తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు.పట్టణంలోని ఈశ్వర్ కాలనీలో జరిగిన ఇంటి దొంగతనం కేసును సాంకేతిక ఆధారాలతో ఛేదించారు. నిందితుడి నుంచి బంగారు,వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను షాద్‌నగర్ సీఐ సీతారాం వెల్లడించారు.ఈశ్వర్ కాలనీకి చెందిన రమేష్ వాంకుడోతు తన మేనమామ అనారోగ్యంతో బాధపడుతుండటంతో సెప్టెంబర్ 29న కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి వెళ్లాడు.ఇంటికి తాళం వేసి వెళ్లిన ఆయన అక్టోబర్ 2న తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టిఉన్నాయి.బీరువాలోని బంగారు,వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించారు. రాజేంద్రనగర్ మండలం హుడా కాలనీకి చెందిన జగన్నాథ ప్రభు (32)ను నవంబర్ 7న హైదర్‌గూడ,అత్తాపూర్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు చోరీకి పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అక్టోబర్ 1న ఆరంఘర్ నుంచి బస్సులో షాద్‌నగర్‌కు వచ్చిన నిందితుడు. అర్ధరాత్రి సమయంలో ఈశ్వర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించాడు. ప్రహరీ గోడ దూకి లోపలికి ప్రవేశించి ఐరన్ రాడ్డుతో ఇంటి తాళాలు, బీరువా,లాకర్‌ను పగలగొట్టి ఆభరణాలను అపహరించినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడి నుంచి బంగారు చెవి కమ్మలు, గొలుసులు,బ్రేస్‌లెట్,నల్లపూసల దండతో పాటు ఇతర ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి,డీసీపీ శిరీష రాఘవేంద్ర,ఏసీపీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సీతారాం,క్రైమ్ డీఎస్ఐ శివరెడ్డి,హెడ్ కానిస్టేబుల్ రవీందర్,కానిస్టేబుల్ మోహన్ కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించారు.కేసును ఛేదించిన పోలీసు సిబ్బందికి ఉన్నతాధికారుల ద్వారా రివార్డులు అందించనున్నట్లు సీఐ తెలిపారు.

## తక్షణమే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి

### నిరుద్యోగ జేఏసీ నేత ఇంద్ర నాయక్



**ముషీరాబాద్, (ప్రజావినికిడి):** రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలోపు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగ అభ్యర్థులు భారీ ధర్నా నిర్వహించారు. ఉద్యోగ నోటిఫికేషన్ ల కోసం నిరుద్యోగ జేఏసీ తలపెట్టిన ర్యాలీని పోలీసులు పర్మిషన్ ఇవ్వకపోవడంతో నిరుద్యోగ జేఏసీ నాయకులు చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి భారీ ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ నాయకులు శంకర్ నాయక్ ఇంద్ర నాయక్ లు మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో ర్యాలీలు తీయవచ్చు కానీ తెలంగాణలో మాత్రం ర్యాలీలకు ఎందుకు పర్మిషన్ ఇవ్వట్లేదని ప్రశ్నించారు.ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీకి ఒక రాజ్యాంగం నిరుద్యోగులకు మరో రాజ్యాంగం అమలవుతుందా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపుగా మూడు సంవత్సరాలు అవుతున్న ఒక్క జనరల్ నోటిఫికేషన్ ఇవ్వలేదని, నిరుద్యోగుల బాధలు ప్రభుత్వానికి కనిపించట్లేదా అని నిలదీశారు. వెంటనే మెగా డీఎస్సీ,గ్రూప్స్ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయకుంటే రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎలక్షన్లో నిరుద్యోగులంతా కాంగ్రెస్ పార్టీని ఓడిస్తామని హెచ్చరించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఉమ్మడి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ సార్ మాట్లాడుతూ, జనవరిలోపు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. తక్షణమే ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.పక్క రాష్ట్రంలో ఉద్యోగ ప్రకటనలు వెలువడుతున్న తెలంగాణలో మాత్రం ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు కుమార్ రాథోడ్, రవి నాయక్, గణేష్,బాలు, నరేష్,బిందు, సుహాసిని,వేణు, భార్గవి,సవాయ్ సింగ్,సురేష్ పోటీ పరీక్ష అభ్యర్థులు పాల్గొన్నారు.

## 17 ఏళ్ల నిరీక్షణకు తెర.. కూకట్‌పల్లి ఫ్లాట్లపై సుప్రీం కీలక ఆదేశాలు

**కూకట్‌పల్లి ఫ్లాట్లపై 17 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదం**

**101 మందికి నవంబర్ 23లోగా రిజిస్ట్రేషన్ చేయాలని సుప్రీం ఆదేశం**



**నవంబర్ 7: ,(ప్రజావినికిడి):**

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ఫేజ్-15లో ఇళ్ల కోసం గత 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న కొనుగోలుదారులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వివాదంలో ఉన్న 101 ఫ్లాట్లను ఈ నెల 23వ తేదీలోగా కొనుగోలుదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని తెలంగాణ హౌసింగ్ బోర్డును సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లితో కూడిన ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

వాయిదాల చెల్లింపుల్లో జాప్యం జరిగిన వారి నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయాలా? వద్దా? అనే అంశాన్ని హైకోర్టు తేల్చే వరకు వేచి చూడాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, వడ్డీ వివాదం తేలే వరకు కొనుగోలుదారులను ఇబ్బంది పెట్టకూడదని పేర్కొంటూ, తక్షణమే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. హైకోర్టులో కేసు పరిష్కారమయ్యే వరకు ఈ ఇళ్లను ఇతరులకు విక్రయించడం లేదా బదిలీ చేయడం వంటి చర్యలు చేపట్టరాదని అటు హౌసింగ్ బోర్డుకు, ఇటు కొనుగోలుదారులకు న్యాయస్థానం ఆంక్షలు విధించింది. 2009లో హౌసింగ్ బోర్డు 'సంపూర్ణం' పథకం కింద కేపీహెచ్‌బీలో ఇళ్లను కేటాయించింది. తొలుత ఫ్లాట్ ధరను రూ.30.80 లక్షలుగా నిర్ణయించి, ఆ తర్వాత దానిని రూ.47.85 లక్షలకు పెంచడంతో వివాదం మొదలైంది. నిర్మాణంలో జాప్యం, అదనపు ధరల వసూలుపై కొనుగోలుదారులు వినియోగదారుల ఫోరం నుంచి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) వరకు న్యాయపోరాటం చేశారు. బోర్డు వైపు నుంచే జాప్యం జరిగిందని నిర్ధారించిన ఎన్‌సీడీఆర్‌సీ, కొనుగోలుదారుల నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయడం సమర్థనీయం కాదని గతంలో తీర్పునిచ్చింది.ఈ తీర్పును సవాలు చేస్తూ హౌసింగ్ బోర్డు తొలుత హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా.. తమ వైపు నుంచి జరిగిన ఆలస్యానికి 6 శాతం వడ్డీ చెల్లిస్తామని, అయితే కొనుగోలుదారుల నుంచి మాత్రం 14 శాతం వడ్డీ వసూలుకు అనుమతించాలని బోర్డు కోరింది. బోర్డు వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, బాధితుల 17 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలుకుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

## తెలంగాణ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన కాకి నరసింహ ముదిరాజ్



**హయత్ నగర్,(ప్రజావినికిడి):**

తెలుగు రాష్ట్రాల ప్రజలు ఘనంగా దీపావళి జరుపుకోవాలని కోరుకుంటున్నానని భగవంతుని ప్రార్థిస్తున్నాను అని తెలిపారు ఈ దీపావళి సందర్భంగా బాంబులు కాకర్స్ కాల్చడం వల్ల పొల్యూషన్ ఎక్కువ అవుతుందని జాగ్రత్తగా పొల్యూషన్ చేయకుండా కాల్చాలని వేడుకుంటున్నాను అని తెలిపారు.ఏలినో ఎఫెక్ట్ వల్ల వాటర్ ప్రాబ్లమ్స్ వస్తున్నాయని రాబోయే రోజులలో వాటర్ ప్రాబ్లం అవుతుందని కాలుష్యం తగ్గించడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని అతి తక్కువ వాటర్ వినియోగించాలని అన్నారు. ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# బీఆర్ఎస్ పార్టీ నిరర్ధక ఆస్తి

**తొమ్మిది సర్వేలు చేసినా డిండికి నీళ్లు ఎక్కడి నుంచి తీసుకోవాలో చెప్పలేదు**

**ఏదుల నుంచి డిండికి నీళ్లు తెస్తామన్న సీఎం..**

**జిల్లాల మధ్య నీటి వివాదాలు సృష్టిస్తున్నారు: కల్వకుంట్ల కవిత**




**డిండి, నవంబర్ 7: ,(ప్రజావినికిడి):**

ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నిరర్ధక ఆస్తి(నాన్ పర్‌ఫార్మింగ్ అసెట్)గా మిగిలిపోయిందని తెలంగాణ రక్షణ సమితి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు తొమ్మిది సర్వేలు చేసిన బీఆర్ఎస్.. డిండి ఎత్తిపోతలకు ఎక్కడి నుంచి నీళ్లు తీసుకోవాలో చెప్పలేకపోయిందని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఏదుల నుంచి డిండికి నీళ్లు తెస్తామని చెప్పి.. జిల్లాల మధ్య నీటి వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. నల్లగొండ జిల్లాలోని డిండి ప్రాజెక్టును శనివారం సందర్శించిన కవిత.. ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. డిండి ఎత్తిపోతలకు ఏదుల నుంచి నీరు తేవడం అంత సులువుకాదని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

ఎల్లూరు పంపుహౌస్ కోసం చేపట్టిన బ్లాస్టింగ్‌తో కల్వకుర్తి పంపుహౌస్‌లో ఒక పంపు దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టలేదని తెలిపారు. ప్రస్తుతం 0.6 టీఎంసీల కోసం మరో సోర్సు కోసం పంపుహౌస్ తవ్వితే కల్వకుర్తి, పాలమూరు పంపుహౌస్‌లకు ప్రమాదం తప్పదని హెచ్చరించారు. ఇన్ని అడ్డంకుల మధ్య ఏదుల నుంచి డిండికి లింకు చేస్తామనడం, రెండు జిల్లాల ప్రజల మధ్య నీటి వివాదాలు సృష్టించడమేనని అన్నారు. కాళేశ్వరం అదనపు టీఎంసీ నీటితో బస్వాపూర్ మీదుగా డిండి ఎత్తిపోతలకు నీళ్లు ఇవ్వడమే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. లేదంటే బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి శివన్నగూడెం, కిష్టరాయన్‌పల్లి మీదుగా డిండికి నీటిని తరలించవచ్చని ప్రతిపాదించారు.

మూడో ప్రతిపాదనగా మల్లన్న సాగర్ నుంచి కొండపోచంపల్లికి అక్కడి నుంచి శామీర్‌పేట చెరువు, శివన్నగూడెంల నుంచి డిండి రిజర్వాయర్‌ను నింపవచ్చని సూచించారు. కృష్ణా జలాలను కాపాడుకునేందకు గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రయత్నించలేదని ఆరోపించారు. కాగా, ఎల్‌నినో నేపథ్యంలో ప్రతి ఎకరాకు రూ.25వేలు పరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని కవిత పిలుపునిచ్చారు.

## హైదరాబాద్‌లో అడుగంటుతున్న భూగర్భ జలాలు..

### తాగునీటి లభ్యతపై ఆందోళన!



భాగ్యనగరానికి నీటి గండం పొంచి ఉంది. హైదరాబాద్, దాని చుట్టుపక్కల మున్సిపల్ ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాలు ప్రమాదకర స్థాయిలో పడిపోతున్నాయి. వర్షాభావ పరిస్థితులు, బోరుబావులపై ఆధారపడటం పెరగడంతో రాబోయే నెలల్లో తాగునీటి లభ్యతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. తెలంగాణ భూగర్భ జల శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, 2026 సెప్టెంబర్, అక్టోబర్ నెలల మధ్య కేవలం ఒక్క నెలలోనే నగరంలో సగటు భూగర్భ జల మట్టం 1.01 మీటర్ల మేర పడిపోయింది.భూగర్భ జల శాఖ అక్టోబర్ నివేదిక ప్రకారం, గ్రేటర్ హైదరాబాద్ , సైబరాబాద్ మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల పరిధిలో సెప్టెంబర్‌లో భూమికి 11.58 మీటర్ల లోతులో ఉన్న నీటి మట్టం, అక్టోబర్ నాటికి 12.59 మీటర్లకు పడిపోయింది. గతేడాది అక్టోబర్ 2025లో ఇదే ప్రాంతంలో సగటు నీటి మట్టం కేవలం 5.42 మీటర్ల లోతులోనే ఉండగా, ఈ ఏడాది ఏకంగా 7.17 మీటర్లు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నగరంలోని 46 మండలాల్లో 107 పీజోమీటర్ల ద్వారా ఈ వివరాలను సేకరించినట్లు 'ది హిందూ' తన కథనంలో పేర్కొంది.నగరంలోని పలు ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. కూకట్‌పల్లిలో అత్యధికంగా 22.88 మీటర్ల లోతుకు నీటి మట్టం పడిపోగా, శంకర్‌పల్లిలో 21.81 మీటర్లు, మేడిపల్లిలో 20.31 మీటర్ల లోతులో నమోదైంది. అమీర్‌పేట, కుత్బుల్లాపూర్, సరూర్‌నగర్, పటాన్‌చెరు, ఉప్పల్ వంటి ప్రాంతాల్లోనూ నీటి మట్టాలు 15 మీటర్లకు పైగా లోతుకు చేరాయి.

ఈ దుస్థితికి ప్రధాన కారణం వర్షాభావమే. జూన్ 1 నుంచి అక్టోబర్ 31 వరకు హైదరాబాద్ పట్టణ ప్రాంతంలో సాధారణ వర్షపాతం 729 మి.మీ. కాగా, కేవలం 484 మి.మీ. వర్షం మాత్రమే కురిసింది. ఇది సుమారు 34% లోటు. భూగర్భ జలాలు అడుగంటడంతో ప్రజలు వాటర్ ట్యాంకర్లపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ అక్టోబర్ 2025లో 87,056 ట్యాంకర్లను సరఫరా చేయగా, ఈ ఏడాది అక్టోబర్‌లో ఆ సంఖ్య 2,20,887కి చేరింది. ఇది సుమారు 153.7% పెరుగుదల.ఈ నేపథ్యంలో, అక్రమ బోరుబావులపై హైడ్రా చర్యలు చేపట్టింది. మరోవైపు, నీటి వృథాను అరికట్టేందుకు HMWSSB 'పానీ' (PAANI) అనే మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. "ప్రతి ఒక్కరూ రోజుకు 20 నుంచి 25 లీటర్ల నీటిని ఆదా చేస్తే, మన కార్యకలాపాలకు ఆటంకం లేకుండా నీటిని పొదుపు చేయవచ్చు" అని నవీఐఆదీ మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్ రెడ్డి సూచించారు. వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ వంటి చర్యలు చేపట్టాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## తెలంగాణ పోలీసుల ఆరోగ్యం కోసం 'ఫిట్ కాప్'.. త్వరలో అందుబాటులోకి హెల్త్ యాప్

**నవంబర్ 7,(ప్రజావినికిడి):**

తెలంగాణ పోలీస్ శాఖ తమ సిబ్బంది ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపరిచేందుకు ఒక కీలకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 90 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది కోసం 'ఫిట్ కాప్' అనే సమగ్ర ఆరోగ్య నిర్వహణ యాప్‌ను తీసుకురానున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ శుక్రవారం ప్రకటించారు. విధి నిర్వహణలో తీవ్రమైన ఒత్తిడి, సమయాభావం కారణంగా సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి పెట్టలేకపోతున్నారని, ఈ యాప్ ఆ లోటును భర్తీ చేస్తుందని ఆయన తెలిపారు.

హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్, ఇతర సంస్థల సహకారంతో 'టీజీ ఫిట్‌కాప్' పేరుతో ఈ పోలీస్ హెల్త్ మేనేజ్‌మెంట్ ప్రొఫైల్ సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. రాబోయే 30 నుంచి 45 రోజుల్లో దీన్ని అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ యాప్ ద్వారా సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్య వివరాలను నమోదు చేయవచ్చు. మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్ , జీవనశైలి అలవాట్లు, ధూమపానం, మద్యపానం వంటి కీలక సమాచారాన్ని సేకరిస్తారు.సిబ్బంది తమ మొబైల్ ఫోన్ నంబర్‌తో ఈ సిస్టమ్‌లోకి లాగిన్ కావచ్చు. వారు అందించిన సమాచారం ఆధారంగా వారిని తక్కువ, మధ్యస్థ, అధిక రిస్క్ గ్రూపులుగా వర్గీకరిస్తారు. ఈ రిస్క్ అసెస్‌మెంట్ ద్వారా ఎవరికి తక్షణ వైద్య సహాయం అవసరమో గుర్తిస్తారు.



హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సల్మాన్ మాట్లాడుతూ, రిస్క్ స్థాయిని బట్టి ప్రత్యేక కాల్ సెంటర్ ద్వారా సిబ్బందిని సంప్రదిస్తామని తెలిపారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు, ఆసుపత్రిలో చికిత్స, ఆరోగ్య సలహాలు, కౌన్సెలింగ్ అందిస్తామని వివరించారు. ముఖ్యంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవి తీవ్రం కాకముందే వైద్య సహాయం అందించడం 'ఫిట్ కాప్' ప్రాథమిక లక్ష్యం. ఈ కార్యక్రమం ద్వారా సిబ్బందిలో ఆరోగ్య స్పృహను పెంచి, నివారణ చర్యలను ప్రోత్సహించాలని పోలీస్ శాఖ భావిస్తోంది. తెలంగాణ పోలీస్ శాఖలోని అన్ని విభాగాలు, విభాగాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నారు. 'ఫిట్ కాప్' సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడటానికి ఒక ముఖ్యమైన వ్యవస్థాగత యంత్రాంగంగా ఎదుగుతుందని డీజీపీ ఆనంద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ పోలీస్ అధికారులు, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# చీకట్లను పారదోలే దీపావళి పెలుగులు!







**నవంబర్ 7,(ప్రజావినికిడి):**

భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో దీపావళికి విశిష్టమైన స్థానం ఉంది. చీకటిని పారదోలుతూ వెలుగులను నింపే దీపావళి పండుగ ప్రతి ఒక్కరిలో కొత్త ఆశలను, ఆనందాలను చిగురింపజేస్తుంది. చెడుపై మంచి, అసత్యంపై సత్యం, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకోవడం మన సంప్రదాయం. అయితే దీపావళి అంటే కేవలం దీపాలు వెలిగించడం, బాణసంచా కాల్చడం, మిఠాయిలు పంచుకోవడం మాత్రమే కాదు. మనిషిలోని చీకటి ఆలోచనలను తొలగించి మంచి మార్గంలో నడవాలనే గొప్ప సందేశం ఈ పండుగలో దాగి ఉంది.

పురాణాల ప్రకారం శ్రీరాముడు రావణాసురుడిని సంహరించి అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంగా ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికారు. మరోవైపు శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించిన సందర్భాన్ని పురస్కరించుకుని దీపావళి వేడుకలు నిర్వహించే సంప్రదాయం ఉంది. ఈ పురాణ గాథల అంతరార్థం ఒక్కటే.. అధర్మం ఎంత బలంగా కనిపించినా చివరికి ధర్మానిదే విజయం. ఈ స్ఫూర్తిని నేటి సమాజం కూడా ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉంది.

ప్రస్తుత సమాజంలో మనుషుల మధ్య అసూయ, ద్వేషం, స్వార్థం, వివక్ష పెరుగుతున్న తరుణంలో దీపావళి అందించే ఐక్యతా సందేశం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. పండుగలు మనుషులను దగ్గర చేయాలి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒకచోట చేరి ఆనందాలను పంచుకోవాలి. ఆర్థిక ఇబ్బందులతో పండుగకు దూరంగా ఉండే పేద కుటుంబాల జీవితాల్లోనూ వెలుగులు నింపాలి. మన ఆనందం ఇతరుల కళ్లలోనూ కనిపించినప్పుడే పండుగకు నిజమైన అర్థం చేకూరుతుంది.

అయితే దీపావళి వేడుకల పేరుతో పర్యావరణానికి హాని కలిగించడం ఆందోళనకరం. బాణసంచా కాల్చడం వల్ల వెలువడే పొగ వాయు కాలుష్యానికి, అధిక శబ్దం శబ్ద కాలుష్యానికి కారణమవుతాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలున్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. మూగజీవాలు సైతం బాణసంచా శబ్దాలకు భయాందోళనలకు గురవుతాయి. అందువల్ల వేడుకలను పరిమితంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలి. పర్యావరణ హితమైన దీపావళికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలి.

మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించడం, స్థానిక చేతివృత్తుల వారికి ప్రోత్సాహం అందించడం, పేదలకు వస్త్రాలు, ఆహారం పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు పండుగకు మరింత సార్థకత చేకూరుస్తాయి. పిల్లలకు పండుగల వెనుక ఉన్న సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను తెలియజేయాలి.

నిజానికి మనిషి జీవితంలో చీకటి అనేది సమస్యలకు, వెలుగు అనేది ఆశకు ప్రతీక. సమస్యలు ఎదురైనప్పుడు నిరాశ చెందకుండా ధైర్యంగా ముందుకు సాగాలనే స్ఫూర్తిని దీపావళి అందిస్తుంది. ప్రతి ఇంటిలో దీపం వెలిగినట్లే ప్రతి హృదయంలో మానవత్వం వెలగాలి. ద్వేషం స్థానంలో ప్రేమ, స్వార్థం స్థానంలో సేవాభావం, వివక్ష స్థానంలో సమానత్వం వెల్లివిరియాలి. అప్పుడే దీపావళి పండుగకు నిజమైన పరమార్థం చేకూరుతుంది. వెలుగుల పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపడంతో పాటు సమాజంలో సరికొత్త మార్పులకు నాంది పలకాలి.

## కానిస్టేబుల్ కిరాతకం..
# భార్యను చంపి.. గోదావరిలో పడేసి..

**తండ్రి సాయంతో మృతదేహం తరలింపు**

**గోదావరిలో పడేసిన తండ్రీకొడుకులు**

**ద్విచక్రవాహనంపై 60 కి.మీ. ప్రయాణం**

**పోలీసుల గాలింపులో మృతదేహం వెలికితీత**

**నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్న పోలీసులు**

**కానిస్టేబుల్ తండ్రి కోసం గాలింపు**



**నవంబర్ 7 ,(ప్రజావినికిడి):**

భార్యను హత్య చేసిన ఓ ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) కానిస్టేబుల్.. మృతదేహాన్ని మూటలో కట్టి ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి గోదావరిలో పడేశాడు. ఈ ఘటనలో అతడికి తండ్రి కూడా సహకరించాడు. పోలీసుల విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. నదిలో గాలింపు చేపట్టిన పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. నిందితుడి తండ్రిని ఇంకా అరెస్టు చేయాల్సి ఉంది.

కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ బి. రోహిత్‌రాజు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలోని గొల్లగూడెంలో అద్దె ఇంట్లో నివసిస్తున్న బోడా నరేందర్ (ఏఆర్‌పీసీ-623) నవంబర్ 3 రాత్రి భార్య భవానీ (29)ని గొంతు నులిమి హత్య చేశాడు. చేతులతోపాటు స్కార్ఫ్ ఉపయోగించి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు.

అనంతరం మృతదేహాన్ని గోళియా తండాలోని తన స్వగ్రామానికి తీసుకెళ్లాడు. తండ్రి బోడా హరిలాల్ సాయంతో వ్యవసాయ పొలంలో దాచిపెట్టాడు. నవంబర్ 4 రాత్రి 11 గంటల సమయంలో ఇద్దరూ కలిసి మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై భద్రాచలానికి తీసుకెళ్లారు. జాతీయ రహదారి-30 మీదుగా సుమారు 60 కిలోమీటర్లు ప్రయాణించి గోదావరి వంతెన వద్దకు చేరుకున్నారు. అక్కడ మృతదేహాన్ని నదిలో పడేసి ఆధారాలు మాయం చేసేందుకు ప్రయత్నించారు.

భవానీ కనిపించడం లేదంటూ ఆమె సోదరి గుండారపు స్వరూప నవంబర్ 6న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. అదే రోజు నరేందర్ పోలీసులను సంప్రదించి భార్యను హత్య చేసినట్లు అంగీకరించాడు. దీంతో పోలీసులు గోదావరిలో గాలింపు చేపట్టి శుక్రవారం రాత్రి భవానీ మృతదేహాన్ని గుర్తించారు. దాన్ని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. నరేందర్‌ను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్పీ తెలిపారు. అతడి తండ్రి హరిలాల్ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

భవానీ, నరేందర్‌కు మూడేళ్ల క్రితం ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. కొంతకాలం సహజీవనం చేసిన వీరు 2025 ఏప్రిల్‌లో భద్రాద్రి ఆలయంలో వివాహం చేసుకున్నారు. అయితే భవానీని పెళ్లి చేసుకోవడాన్ని నరేందర్ కుటుంబ సభ్యులు వ్యతిరేకించడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవని సమాచారం.

# చమురు శుద్ధిలో భారత్ దూకుడు..

**అమెరికా, యూరప్‌పై వ్యూహాత్మక ఆధిక్యం**

**నవంబర్ 7 ,(ప్రజావినికిడి):**

ముడి చమురు అవసరాల్లో దాదాపు 88 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న భారత్.. శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల్లో మాత్రం ప్రపంచంలో కీలక శక్తిగా ఎదుగుతోంది. అమెరికా, ఐరోపా దేశాలు చమురు శుద్ధి సామర్థ్యాన్ని తగ్గించుకుంటుంటే.. భారత్ మాత్రం దాన్ని విస్తరిస్తోంది. దీంతో అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో దేశానికి వ్యూహాత్మక ఆధిక్యం లభిస్తోందని 'ఇండియా నెరేటివ్' కథనం విశ్లేషించింది.

2026 ఏప్రిల్ నాటికి భారత్ చమురు శుద్ధి సామర్థ్యం ఏడాదికి 267.1 మిలియన్ టన్నులుగా ఉంది. రోజుకు సుమారు 53 నుంచి 56 లక్షల బ్యారెళ్లకు సమానమైన ఈ సామర్థ్యంతో ప్రపంచంలో నాలుగో స్థానంలో నిలిచింది. అమెరికా, చైనా, రష్యా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. 2030 నాటికి శుద్ధి సామర్థ్యాన్ని 300 మిలియన్ టన్నులకు పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. దీర్ఘకాలంలో 400 మిలియన్ టన్నులకు చేర్చాలని భావిస్తోంది.



భారత్ రోజుకు 54 నుంచి 56 లక్షల బ్యారెళ్ల ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఇందులో రష్యా వాటా ఇటీవల 18 నుంచి 20 లక్షల బ్యారెళ్లుగా ఉంది. మొత్తం దిగుమతుల్లో ఇది దాదాపు 35 శాతం. గతంలో ఈ వాటా 50 శాతాన్ని దాటిన సందర్భాలున్నాయి. ధరల ఆధారంగా భారత్ కొనుగోళ్ల నిర్ణయాలు తీసుకుంటోందని కథనం పేర్కొంది. మరోవైపు శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా భారత్‌కు భారీ ఆదాయం వస్తోంది. 2026 సెప్టెంబర్‌తో ముగిసిన ఆరు నెలల్లో ఈ ఎగుమతుల విలువ 27.2 బిలియన్ డాలర్లకు చేరింది. ఇందులో డీజిల్ వాటా 12.6 బిలియన్ డాలర్లు. సెప్టెంబర్‌లో రోజుకు సుమారు 6.2 లక్షల బ్యారెళ్ల డీజిల్‌ను భారత్ ఎగుమతి చేసింది. ఇందులో దాదాపు సగం ఐరోపా దేశాలకే వెళ్లింది. రష్యా ఉత్పత్తులపై పరిమితులు, ఐరోపాలో రిఫైనరీల మూసివేత, మధ్యప్రాచ్యంలో నిర్వహణ పనుల కారణంగా ఏర్పడిన కొరతను భారత ఎగుమతులు కొంతవరకు భర్తీ చేస్తున్నాయి. రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో భారత్‌పై అమెరికా ఆంక్షలు, సుంకాల ఒత్తిడి తెస్తున్నా.. భారత రిఫైనరీల్లో శుద్ధి చేసిన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన సరఫరాకు ఉపయోగపడుతున్నాయని కథనం విశ్లేషించింది. ఇంధన ధరలు పెరిగినప్పుడు అమెరికా కూడా కొన్ని ఆంక్షల విషయంలో మినహాయింపులు ఇచ్చిందని గుర్తుచేసింది. భారత్ రిఫైనింగ్ సామర్థ్యం పెరిగితే ప్రపంచ మార్కెట్‌లో సరఫరా సమతుల్యతను ప్రభావితం చేసే స్థాయిలో దేశం నిలుస్తుందని పేర్కొంది.

# పరిషత్ ఎన్నికల్లో ఆసక్తికర ఘటనలు

**: జగన్ మేనత్త ఊరిలో టీడీపీ.. తోడికోడళ్ల పోరులో జనసేన పైచేయి!**

**తమ్మినపట్నంలో ఒక్క ఓటు తేడాతో అరుణ విజయం**

**చంద్రవరంలో మూడు ఓట్ల ఆధిక్యంతో టీడీపీ గెలుపు**

**పాచిపెంటలో తండ్రి, కుమార్తెకు విజయం**

**పెదమల్లంలో తోడికోడళ్ల పోరులో జనసేన అభ్యర్థి గెలుపు**

**పోస్టల్ బ్యాలెట్లలో భారీగా చెల్లని ఓట్లు**




**నవంబర్ 7,(ప్రజావినికిడి):**

ఏపీ పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో పలు ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. కొన్ని చోట్ల స్వల్ప ఓట్ల తేడాతో అభ్యర్థులు గెలుపొందగా.. మరికొన్ని చోట్ల కుటుంబ సభ్యుల మధ్యే రాజకీయ పోరు సాగింది. ఒకచోట తండ్రి, కుమార్తె విజయం సాధించగా.. మరోచోట తోడికోడళ్ల మధ్య జరిగిన పోటీలో కూటమి అభ్యర్థి గెలిచారు.

ఎన్టీఆర్ జిల్లా గణపవరంలో 20 ఏళ్ల తర్వాత టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి విజయం సాధించారు. ఈ గ్రామం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సోదరి, జగన్ మేనత్త విమలమ్మ స్వగ్రామం కావడం గమనార్హం. నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నంలో టీడీపీ అభ్యర్థి అరుణ రీకౌంటింగ్ తర్వాత ఒక్క ఓటు తేడాతో గెలుపొందారు. తొలుత ఆరు ఓట్ల తేడా రావడంతో అధికారులు మళ్లీ లెక్కింపు చేపట్టారు. ఫలితం వెలువడిన తర్వాత వైకాపా అభ్యర్థి కౌంటింగ్ కేంద్రం వద్ద బైఠాయించి న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు.

తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం చంద్రవరం ఎంపీటీసీ స్థానంలో టీడీపీ అభ్యర్థి కాట్రూ శ్రీనివాసరావు కేవలం మూడు ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం మాతుమూరు, పాంచాలి ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేసిన తండ్రి జి.యుగంధర్, కుమార్తె కావ్య గెలుపొందారు.

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం పెదమల్లంలో తోడికోడళ్ల మధ్య జరిగిన పోరులో జనసేన అభ్యర్థి బోడపాటి మంగదేవి 18 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.అనకాపల్లి జిల్లా నక్కపల్లి 1, 2 ఎంపీటీసీ స్థానాల్లో వైకాపా అభ్యర్థులు తుమ్మ కల్పన, గొడుగుల బంగార్రాజు గెలుపొందారు. నక్కపల్లి-2 పరిధిలోనే హోంమంత్రి అనిత నివాసం ఉండటం గమనార్హం.పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు సందర్భంగా బ్యాలెట్ బాక్సులో ఓట్లతోపాటు కరపత్రాలు బయటపడ్డాయి. సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల బ్యాలెట్ బాక్సుల్లో ఈ కరపత్రాలను గుర్తించారు. గ్రామానికి వెళ్లే రహదారిలో రైల్వే గేటు వద్ద యూ ఆకారంలో అండర్‌పాస్ నిర్మించవద్దని, ప్రధాన రహదారికి అనుసంధానంగా బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు వాటిలో విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ స్పందించాలని కోరారు.తిరుపతి రూరల్ జడ్పీటీసీ స్థానంలో వైకాపా అభ్యర్థి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, టీడీపీ అభ్యర్థి ధనలక్ష్మి తరఫున వారి కుటుంబ సభ్యులు కౌంటింగ్ కేంద్రానికి వచ్చి లెక్కింపును పరిశీలించారు. మరోవైపు పోస్టల్ బ్యాలెట్లలో చెల్లని ఓట్లు భారీగా నమోదయ్యాయి. అల్లూరి జిల్లా అనంతగిరిలో 137 పోస్టల్ ఓట్లకు 91 చెల్లనివిగా తేలాయి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# బీసీల భవిత మారాలంటే అధికారంలో వాటా కల్పించాలి!

**రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న బీసీలు.. విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ రంగాల్లో ఇంకా వెనుకబాటే.. ఎన్నికల హామీలు అమలయ్యేదెప్పుడు?**



తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో బీసీల పాత్ర అత్యంత కీలకమైనది. వ్యవసాయం నుంచి పారిశ్రామిక రంగం వరకు, చేతివృత్తుల నుంచి వ్యాపార రంగం వరకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నుంచి పట్టణ అభివృద్ధి వరకు బీసీ వర్గాలు తమ శ్రమతో సమాజ నిర్మాణంలో కీలక భాగస్వాములుగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర జనాభాలో గణనీయమైన వాటా కలిగిన బీసీలు మాత్రం నేటికీ సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధించలేకపోతున్నారు. తరతరాలుగా కష్టపడుతూ సమాజానికి సేవలందిస్తున్న ఈ వర్గాలకు విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక స్వావలంబన వంటి రంగాల్లో సమాన అవకాశాలు అందకపోవడం సామాజిక న్యాయానికి సవాలుగా మారుతోంది. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ రాజకీయ పార్టీలు బీసీల అభ్యున్నతి గురించి గొప్పగా మాట్లాడుతున్నాయి. అధికారంలో వాటా కల్పిస్తామని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేస్తామని, కులవృత్తులను అభివృద్ధి చేస్తామని హామీలు ఇస్తున్నాయి. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఆ హామీల అమలులో మాత్రం ఆశించిన పురోగతి కనిపించడం లేదు.**కులగణనతో బీసీలకు కొత్త ఆశలు**తెలంగాణలో బీసీ కులగణన చేపట్టడం సామాజిక న్యాయం దిశగా ఒక కీలక పరిణామం. ఇప్పటివరకు బీసీల జనాభా, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అనేక చర్చలు జరిగినప్పటికీ కులగణన ద్వారా మరింత స్పష్టమైన గణాంకాలు అందుబాటులోకి వచ్చాయి. ఏ వర్గం ఎంతమంది ఉన్నారు? వారి విద్యా స్థాయి ఎలా ఉంది? ఉద్యోగాలు, ఉపాధి, ఆర్థిక పరిస్థితుల్లో ఎలాంటి వెనుకబాటుతనం ఉంది? అనే అంశాలను అర్థం చేసుకోవడానికి ఈ గణాంకాలు ఉపయోగపడతాయి. అయితే కులగణన నిర్వహించడంతోనే ప్రభుత్వ బాధ్యత పూర్తయినట్లు కాదు. సేకరించిన వివరాల ఆధారంగా బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో తగిన అవకాశాలు కల్పించాలి. జనాభాను లెక్కించడం ఎంత ముఖ్యమో, ఆ జనాభాకు తగిన అభివృద్ధి ఫలాలు అందించడం అంతకంటే ముఖ్యం. కులగణన గణాంకాలు కేవలం ప్రభుత్వ రికార్డులకే పరిమితం కాకుండా బీసీల జీవితాల్లో వాస్తవ మార్పులకు పునాదిగా మారాలి.**రాజకీయ ప్రాతినిధ్యమే సామాజిక న్యాయానికి పునాది**బీసీలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్ చాలాకాలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ రాష్ట్రవ్యాప్తంగా బలంగా ఉంది. ఈ విషయంలో శాసనపరమైన, న్యాయపరమైన అడ్డంకులు ఎదురవుతున్న నేపథ్యంలో వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించాలి. బీసీలకు ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరగకుండా చూడాలి. గ్రామపంచాయతీల నుంచి మండల, జిల్లా పరిషత్‌ల వరకు బీసీలకు తగిన ప్రాతినిధ్యం లభించాలి. శాసనసభ, శాసనమండలి, పార్లమెంటులోనూ వారి గొంతుక వినిపించే అవకాశం ఉండాలి. రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా పరిగణించకుండా పార్టీ నిర్ణయాలు, ప్రభుత్వ విధానాల రూపకల్పనలో భాగస్వాములను చేయాలి. జనాభాలో గణనీయమైన వాటా ఉన్నప్పటికీ అధికార నిర్ణయాల్లో తగిన స్థానం లేకపోవడం బీసీ సమాజంలో అసంతృప్తికి కారణమవుతోంది. రాజకీయంగా బలపడినప్పుడే తమ సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలు సాధించుకునే అవకాశం ఉంటుంది.**విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఏదీ?**బీసీ సమాజ అభివృద్ధికి విద్య అత్యంత ముఖ్యమైన ఆయుధం. పేదరికం, నిరక్షరాస్యత, ఆర్థిక ఇబ్బందులను అధిగమించాలంటే విద్యకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అయితే బీసీ విద్యార్థులు నేటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఉపకార వేతనాల చెల్లింపులో జాప్యం కారణంగా పేద విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించే తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని ఆశపడుతున్నారు. కానీ ప్రభుత్వ సహాయం సకాలంలో అందకపోవడంతో అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొంతమంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువులకు దూరమవుతున్నారు. ఇది వారి భవిష్యత్తుపైనే కాకుండా మొత్తం సమాజ అభివృద్ధిపై ప్రభావం చూపుతుంది. అందువల్ల ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సకాలంలో విడుదల చేయాలి.

# 60 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు.. ప్రభుత్వం తీసుకుంది 18 టీఎంసీలే

## : రేవంత్ సర్కార్‌పై హరీశ్ ఫైర్



రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. “ఇది అతివృష్టి కాదు.. అనావృష్టి కాదు.. రేవంత్ వృష్టి” అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదుల్లో పుష్కలంగా నీళ్లున్నా.. పంపులు నడిపి పొలాలకు నీటిని అందించలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా ఎండగడతామని హెచ్చరించారు.

దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నీటిని దిగువకు వదిలేస్తుంటే.. ఏపీ సీఎం చంద్రబాబు వాటిని ఒడిసిపట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. శ్రీశైలంలో తగినంత నీరు ఉన్నా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వద్ద పూర్తిస్థాయిలో మోటార్లు నడపడం లేదని విమర్శించారు. మరోవైపు చంద్రబాబు 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు నీటిని తరలించుకుపోయారని పేర్కొన్నారు.

గ్లోబల్ వార్మింగ్, ఎల్‌నినో ప్రభావం ఉండొచ్చని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో పంటల బీమాపై హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయడం మరిచిపోయారని విమర్శించారు. పంటల బీమా అమల్లో ఉంటే రైతులకు కొంతైనా నష్టపరిహారం అందేదని అన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో కరవు సాయం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతులకు అందిస్తున్నారని గుర్తుచేశారు.రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇంతటి తీవ్రమైన పరిస్థితి ఉన్నా కనీసం క్యాబినెట్ సమావేశంలోనూ దీనిపై చర్చించకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు.

# డేటా కేంద్రాల విస్తరణకు ప్రజాస్వామ్యమే అడ్డుకట్టా?

**విద్యుత్, నీటి వినియోగం నుంచి పర్యావరణ కాలుష్యం వరకు.. అమెరికాలో డెమోక్రాట్ల ఆందోళన**



ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో డేటా సెంటర్ల నిర్మాణం కీలకంగా మారుతోంది. అయితే ఈ కేంద్రాల విస్తరణ ఇప్పుడు అమెరికా రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. ముఖ్యంగా అమెరికా మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో డేటా సెంటర్ల ఏర్పాటు, వాటి వల్ల కలిగే పర్యావరణ, ఆర్థిక సమస్యలు ప్రధాన అంశాలుగా మారాయి. డెమోక్రాట్లు ఈ కేంద్రాల నిర్మాణం, విస్తరణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే వారందరూ పూర్తిగా వ్యతిరేకించడం లేదు. కొందరు నిర్మాణాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని కోరుతుండగా, మరికొందరు కఠినమైన నిబంధనలతో అనుమతించాలని సూచిస్తున్నారు.**ఏమిటీ డేటా సెంటర్లు?** డేటా సెంటర్లు అంటే వేలాది కంప్యూటర్లు, సర్వర్లు ఒకే భవనంలో లేదా భారీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కేంద్రాలు. చాట్‌జీపీటీ వంటి కృత్రిమ మేధ సేవలు, గూగుల్ సెర్చ్, యూట్యూబ్, అమెజాన్, మైక్రోసాఫ్ట్ సేవలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్, సామాజిక మాధ్యమాలు, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అనేక డిజిటల్ సేవలు వీటిపైనే ఆధారపడి పనిచేస్తున్నాయి. మనం ఏఐ ద్వారా ఒక ప్రశ్న అడిగినా, దానికి సమాధానం అందించేందుకు డేటా సెంటర్లలోని సర్వర్లు పనిచేయాల్సి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ వినియోగం పెరుగుతున్న కొద్దీ ఈ కేంద్రాల అవసరం కూడా భారీగా పెరుగుతోంది. అందుకే మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఓపెన్‌ఏఐ వంటి సంస్థలు భారీ పెట్టుబడులతో డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయి.**విద్యుత్ వినియోగమే ప్రధాన సమస్య** డేటా సెంటర్లపై అభ్యంతరాలు వ్యక్తం కావడానికి ప్రధాన కారణం వాటి విద్యుత్ అవసరాలు. ఒక భారీ ఏఐ డేటా సెంటర్ వేలాది, కొన్ని సందర్భాల్లో లక్షలాది ఇళ్లకు అవసరమయ్యేంత విద్యుత్‌ను వినియోగించే పరిస్థితి ఉంటుంది. దీనివల్ల విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగి, విద్యుత్ గ్రిడ్‌పై ఒత్తిడి ఏర్పడుతుంది. అదనపు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, సరఫరా వ్యవస్థల విస్తరణకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఈ ఖర్చును విద్యుత్ సంస్థలు వినియోగదారులపై మోపితే సామాన్య ప్రజల కరెంటు బిల్లులు పెరిగే ప్రమాదం ఉంది. కంపెనీల అవసరాల కోసం ప్రజలు అదనపు భారాన్ని ఎందుకు భరించాలన్నది డెమోక్రాట్ల ప్రధాన ప్రశ్న. డేటా సెంటర్లు తమ విద్యుత్ అవసరాలను తామే సమకూర్చుకోవాలన్న ప్రతిపాదనలు కూడా తెరపైకి వస్తున్నాయి.**నీటి కొరతతో వ్యవసాయానికి ముప్పు** డేటా సెంటర్లలో వేలాది సర్వర్లు నిరంతరం పనిచేయడం వల్ల అధిక వేడి ఉత్పత్తి అవుతుంది. వాటిని చల్లబరిచేందుకు పెద్ద మొత్తంలో నీరు అవసరమవుతుంది. ఇప్పటికే అనేక ప్రాంతాలు నీటి కొరతను ఎదుర్కొంటున్న తరుణంలో భారీ డేటా సెంటర్లకు నీటిని కేటాయించడం స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలిగించవచ్చు. తాగునీటి అవసరాలతో పాటు వ్యవసాయానికి అందాల్సిన నీటి లభ్యత కూడా తగ్గే ప్రమాదం ఉంది. పరిశ్రమల అభివృద్ధి పేరుతో ప్రజల కనీస అవసరాలను విస్మరించకూడదన్న వాదన బలంగా వినిపిస్తోంది.**పర్యావరణంపై తీవ్ర ప్రభావం** డేటా సెంటర్లకు నిరంతర విద్యుత్ సరఫరా అవసరం. ఈ విద్యుత్‌ను బొగ్గు, సహజ వాయువు వంటి సంప్రదాయ ఇంధనాల ద్వారా ఉత్పత్తి చేస్తే కర్బన ఉద్గారాలు పెరిగి వాయు కాలుష్యం తీవ్రతరమవుతుంది. ఫలితంగా వాతావరణ మార్పులపై ప్రభావం పడుతుంది. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చే డెమోక్రాట్లు డేటా సెంటర్లు పునరుత్పాదక ఇంధన వనరులనే వినియోగించాలని కోరుతున్నారు. సౌర, పవన విద్యుత్ వంటి హరిత ఇంధనాల వినియోగం పెంచితేనే పర్యావరణానికి కలిగే నష్టాన్ని కొంతవరకు తగ్గించవచ్చని అభిప్రాయపడుతున్నారు.**భారీ పెట్టుబడులు.. పరిమిత ఉద్యోగాలు** డేటా సెంటర్ల ఏర్పాటుతో స్థానిక ప్రాంతాల్లో వేలాది ఉద్యోగాలు కల్పిస్తామని కంపెనీలు ప్రకటిస్తుంటాయి. అయితే నిర్మాణ సమయంలో మాత్రమే ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుందని, నిర్మాణం పూర్తయ్యాక నిర్వహణకు పరిమిత సంఖ్యలో ఉద్యోగులు సరిపోతారని విమర్శలు ఉన్నాయి. భారీ పెట్టుబడులు పెట్టిన కంపెనీలు బిలియన్ డాలర్ల ఆదాయాన్ని పొందుతున్నప్పటికీ, స్థానిక యువతకు తగిన స్థాయిలో శాశ్వత ఉద్యోగాలు కల్పించడం లేదన్నది మరో అభ్యంతరం. స్థానికుల భూమి, నీరు, విద్యుత్ వనరులను వినియోగించుకుంటున్న సంస్థలు ఆయా ప్రాంతాల అభివృద్ధికి ఎంతవరకు దోహదపడుతున్నాయన్న ప్రశ్న కూడా ముందుకొస్తోంది.**పన్ను రాయితీలపై అభ్యంతరాలు** పెద్ద టెక్నాలజీ కంపెనీలను ఆకర్షించేందుకు అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు డేటా సెంటర్ల పెట్టుబడులకు భారీ పన్ను రాయితీలు కల్పిస్తున్నాయి. దీనివల్ల కంపెనీలకు ఆర్థికంగా ప్రయోజనం కలుగుతున్నప్పటికీ ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయం తగ్గుతోందని డెమోక్రాట్లు విమర్శిస్తున్నారు. కంపెనీలకు రాయితీలు ఇచ్చినప్పుడు వాటి ద్వారా స్థానికులకు ఎలాంటి ప్రయోజనాలు అందుతున్నాయో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరుతున్నారు. ఉపాధి, మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో కంపెనీలు బాధ్యత వహించేలా నిబంధనలు ఉండాలని సూచిస్తున్నారు.**భారత్‌కు కూడా కీలక పాఠాలు** డేటా సెంటర్ల విస్తరణపై అమెరికాలో జరుగుతున్న చర్చ భారత్‌కు కూడా ఎంతో ప్రాధాన్యమైనది. హైదరాబాద్, ముంబై, చెన్నై, బెంగళూరు వంటి నగరాలు డేటా సెంటర్ల పెట్టుబడులకు ప్రధాన కేంద్రాలుగా ఎదుగుతున్నాయి. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్, డిజిటల్ బ్యాంకింగ్ వంటి రంగాల అభివృద్ధికి ఈ కేంద్రాలు అవసరమే. అయితే పెట్టుబడుల ఆకర్షణ పేరుతో విద్యుత్, నీరు, భూమి వంటి వనరులపై ఒత్తిడి పెరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించడం, పర్యావరణానికి హాని కలగకుండా చూడటం, కంపెనీలే తమ విద్యుత్ అవసరాలను సమకూర్చుకునేలా ప్రోత్సహించడం వంటి చర్యలు అవసరం.డేటా సెంటర్ల నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేయడం అభివృద్ధికి ఆటంకం కలిగించవచ్చు. అదే సమయంలో ఎలాంటి నియంత్రణలు లేకుండా అనుమతులు ఇవ్వడం కూడా ప్రజా ప్రయోజనాలకు విరుద్ధం. సాంకేతిక అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులు ఎంత ముఖ్యమో ప్రజల జీవన ప్రమాణాలు, సహజ వనరుల పరిరక్షణ కూడా అంతే ముఖ్యం. అందువల్ల డేటా సెంటర్ల ఏర్పాటుకు స్పష్టమైన విధానాలు, కఠినమైన పర్యావరణ ప్రమాణాలు, బాధ్యతాయుతమైన విద్యుత్, నీటి వినియోగ నిబంధనలు రూపొందించాలి. కంపెనీల లాభాలతో పాటు స్థానిక ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యంగా ఉండాలి.

# ఎవరు ఆర్వగలరు ఈ నిరసన జ్వాలను!

**- ఓటు హక్కు పరిరక్షణ కోసం దేశవ్యాప్త ఉద్యమం.. అణచివేతతో ఆగని ప్రజాగ్రహం**




ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)లో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలతో దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలు ఉధృతమవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటు హక్కును హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పౌరులు, యువత, ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతల నిర్బంధం, పోలీసుల ఆంక్షలు, జంతర్ మంతర్ నిరసన కేంద్రం హోదా తొలగింపు వంటి చర్యలతో ఉద్యమాన్ని అణచివేయవచ్చని ప్రభుత్వం భావించినప్పటికీ పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. రోజురోజుకూ నిరసనలకు మద్దతు పెరుగుతోంది.**ఓటు హక్కుపై ఆందోళన** ఓటర్ల జాబితా సవరణ పేరుతో అనేక అవకతవకలు జరుగుతున్నాయని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. గతంలో ఎన్నికల్లో ఓటు వేసిన వారి పేర్లు తొలగించడం, కొత్త ఓటర్ల నమోదులో ఇబ్బందులు సృష్టించడం ప్రజాస్వామ్య హక్కులకు విఘాతమని విమర్శిస్తున్నారు. అధికారంలో ఉన్న పార్టీ తన రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేస్తోందన్న అనుమానాలు ప్రజల్లో బలపడుతున్నాయి. దీనిపై ప్రభుత్వం, ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.**అణచివేతతో ఆగని ఉద్యమం** సీజేపీ నాయకులను నిర్బంధించినప్పటికీ ఉద్యమం ఆగడం లేదు. యువతీ యువకులు, సాధారణ పౌరులు, మేధావులు, వృద్ధులు సైతం స్వచ్ఛందంగా నిరసనల్లో పాల్గొంటున్నారు. ఇది ఒక పార్టీకి లేదా కొందరు నాయకులకు సంబంధించిన సమస్య కాదని, దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుకు సంబంధించిన అంశమని వారు స్పష్టం చేస్తున్నారు. నిరసనలకు అనుమతులు నిరాకరించడం, పోలీసు ఆంక్షలు విధించడం వంటి చర్యలు ప్రజల్లో మరింత అసంతృప్తిని పెంచుతున్నాయి.**పోలీసుల తీరుపై విమర్శలు** శాంతియుతంగా నిరసన తెలిపే యువతీ యువకులపై పోలీసుల కఠిన వైఖరి, ముఖ్యంగా మహిళా నిరసనకారుల పట్ల వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారితీస్తోంది. నిరసనలపై అణచివేత చర్యలకు బదులుగా ప్రజల సందేహాలకు సమాధానాలు చెప్పాలని ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం పౌరుల హక్కు అని, ఆ హక్కును నిర్బంధాలతో అడ్డుకోలేరని స్పష్టం చేస్తున్నారు.**ప్రభుత్వ ప్రకటనలపై వ్యంగ్యాస్త్రాలు** కేంద్ర హోంమంత్రి అమిత్ షా మరో 30 ఏళ్ల పాటు బీజేపీనే అధికారంలో ఉంటుందని చేసిన వ్యాఖ్యలు కూడా రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. ఒకవైపు ప్రజాస్వామ్య హక్కుల కోసం నిరసనలు జరుగుతుంటే, మరోవైపు సుదీర్ఘకాలం అధికారంలో ఉంటామనే ప్రకటనలు చేయడం విమర్శలకు తావిచ్చింది. నిరసనకారుల ఆరోపణలకు సమాధానాలు ఇవ్వకుండా వారిని దేశ వ్యతిరేకులుగా చిత్రీకరించడం సమస్యను పరిష్కరించదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.**ప్రజాస్వామ్య పరిరక్షణే అసలు లక్ష్యం** ఓటు హక్కు అనేది కేవలం ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం మాత్రమే కాదు. ప్రభుత్వాలను ఎన్నుకోవడం, ప్రశ్నించడం, అవసరమైతే అధికార మార్పునకు అవకాశం కల్పించడం వంటి ప్రజాస్వామ్య వ్యవస్థకు అది పునాది. ఆ పునాదినే బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న భావన ప్రజల్లో ఏర్పడితే ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసం దెబ్బతింటుంది. అందుకే ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత, ఎన్నికల సంఘం స్వతంత్రత, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం అత్యంత అవసరం.ప్రజల ఆందోళనలను నిర్బంధాలతో అణచివేయడం సాధ్యం కాదు. సమస్యలకు సమాధానాలు చెప్పడం, ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపించడం, ప్రజల్లో విశ్వాసం కల్పించడం ద్వారానే నిరసనలకు ముగింపు పలకగలరు. ప్రజాస్వామ్యంలో అధికార పక్షాన్ని ప్రశ్నించే గొంతుకలకు స్థానం ఉండాలి. నిరసన ప్రదేశాలను మూసివేయవచ్చు.. నాయకులను నిర్బంధించవచ్చు.. కానీ ప్రజల్లో పుట్టిన అసంతృప్తిని, హక్కుల కోసం పోరాడాలన్న సంకల్పాన్ని ఆపడం అంత సులభం కాదు. అందుకే ప్రశ్న ఒక్కటే.. ఎవరు ఆర్వగలరు ఈ నిరసన జ్వాలను!

## పాంటింగ్ రికార్డు బద్దలు కొట్టిన

# విరాట్ కోహ్లీ!

**న్యూజిలాండ్‌పై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు.. ఏడడుగుల ఇన్నింగ్స్‌తోనే చరిత్ర సృష్టించిన రన్‌మెషీన్**



న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో వన్డేలో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరో అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ పేరిట ఉన్న రికార్డును అధిగమించి, వన్డే క్రికెట్‌లో న్యూజిలాండ్‌పై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. వెల్లింగ్టన్ వేదికగా శనివారం జరిగిన రెండో వన్డేలో కోహ్లీ కేవలం 7 పరుగులే చేసినప్పటికీ చారిత్రక ఘనత సాధించాడు. **1,978 పరుగులతో అగ్రస్థానం**ఈ మ్యాచ్‌కు ముందు కోహ్లీ, రికీ పాంటింగ్ చెరో 1,971 పరుగులతో సమానంగా ఉన్నారు. రెండో వన్డేలో కోహ్లీ ఒక పరుగు సాధించగానే పాంటింగ్ రికార్డును అధిగమించాడు. న్యూజిలాండ్‌పై ఇప్పటివరకు 38 వన్డే ఇన్నింగ్స్‌ల్లో 1,978 పరుగులు సాధించాడు. ఇందులో ఏడు సెంచరీలు, 11 అర్ధసెంచరీలు ఉన్నాయి. 56.51 సగటుతో అద్భుతమైన ప్రదర్శన కొనసాగిస్తున్నాడు.**పాంటింగ్, సచిన్‌ను వెనక్కి నెట్టి..**న్యూజిలాండ్‌పై అత్యధిక వన్డే పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో కోహ్లీ అగ్రస్థానానికి చేరుకున్నాడు. రికీ పాంటింగ్ 1,971 పరుగులతో రెండో స్థానంలో ఉండగా, భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ 1,750 పరుగులతో మూడో స్థానంలో ఉన్నాడు. కుమార సంగక్కర (1,568), సనత్ జయసూర్య (1,519), జాక్వెస్ కలిస్ (1,449) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు.**రికార్డు సాధించినా.. స్వల్ప స్కోరుకే ఔట్** రెండో వన్డేలో భారత్ 135 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగింది. కోహ్లీ క్రీజులోకి వచ్చిన వెంటనే బౌండరీ బాది రికార్డు అందుకున్నాడు. అయితే ఎక్కువసేపు నిలవలేక ఏడు బంతుల్లో ఒక ఫోర్‌తో ఏడు పరుగులు చేసి జాకబ్ డఫీ బౌలింగ్‌లో విల్ యంగ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అంతకుముందు తొలి వన్డేలో కోహ్లీ 51 బంతుల్లో 74 పరుగులు చేసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.**మరో రికార్డుపై కోహ్లీ కన్ను** న్యూజిలాండ్‌పై అత్యధిక వన్డే పరుగుల రికార్డుతో పాటు అత్యధిక సెంచరీల ఘనత కూడా కోహ్లీ పేరిటే ఉంది. ఈ జట్టుపై ఇప్పటికే ఏడు వన్డే శతకాలు సాధించాడు. రాబోయే మ్యాచ్‌ల్లో మరిన్ని పరుగులు సాధించి తన రికార్డును మరింత మెరుగుపరుచుకునే అవకాశం ఉంది. మరోసారి తన అసాధారణ ప్రతిభతో ప్రపంచ క్రికెట్‌లో ప్రత్యేక స్థానాన్ని చాటుకున్నాడు విరాట్ కోహ్లీ.

## చెలరేగుతున్న భారత పేసర్లు..

## విజయ రహస్యం చెప్పిన మోర్నీ మోర్కెల్!



**ప్రతి బౌలర్‌కు ప్రత్యేక శిక్షణ.. వ్యక్తిగత సూచనలతో అద్భుత ఫలితాలు..**

**న్యూజిలాండ్ పర్యటనపై ప్రత్యేక వ్యూహాలు**

భారత క్రికెట్ జట్టు పేస్ బౌలింగ్ విభాగం అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటోంది. న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో భారత పేసర్లు ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ విజయాల వెనుక ఉన్న అసలు రహస్యాన్ని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ వెల్లడించాడు. జట్టులోని ప్రతి బౌలర్‌కు ప్రత్యేకమైన నైపుణ్యాలు ఉంటాయని, అందుకే అందరికీ ఒకే విధమైన సూచనలు ఇవ్వకుండా వ్యక్తిగతంగా మాట్లాడి అవసరమైన సలహాలు ఇస్తున్నామని తెలిపాడు.**ప్రతి బౌలర్‌కు ప్రత్యేక ప్రణాళిక**శిక్షణ సమయంలో, వార్మప్ సెషన్లలో ఒక్కో బౌలర్‌తో విడివిడిగా మాట్లాడటానికి ప్రాధాన్యం ఇస్తానని మోర్కెల్ వివరించాడు. జట్టుగా సమావేశమై మ్యాచ్‌లో ఎదురయ్యే పరిస్థితులపై చర్చిస్తామని, అనంతరం ప్రతి ఆటగాడి సామర్థ్యానికి అనుగుణంగా సూచనలు అందిస్తామని చెప్పాడు. బౌలర్లకు తమ ఆటపై మంచి అవగాహన ఉందని, చిన్న చిన్న అంశాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లడమే తమ బాధ్యతని పేర్కొన్నాడు.**సుదీర్ఘ పర్యటనకు పక్కా ప్రణాళిక**ఒక నెల వ్యవధిలోనే భారత జట్టు 12 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాల్సి ఉందని మోర్కెల్ తెలిపాడు. ఇందులో 10 పరిమిత ఓవర్ల మ్యాచ్‌లు, రెండు టెస్టులు ఉన్నాయి. ఇలాంటి సుదీర్ఘ పర్యటనల్లో బౌలర్లను సమర్థంగా ఉపయోగించుకోవడం చాలా ముఖ్యమని పేర్కొన్నాడు. విదేశీ గడ్డపై భారత్ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఆశించిన స్థాయిలో ఆడలేకపోయిందని, న్యూజిలాండ్ పర్యటనలో మెరుగైన ప్రదర్శన చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించాడు.**పరిస్థితులకు అనుగుణంగా బౌలింగ్** న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ ఈడెన్ పార్క్ మైదానంలో బౌండరీల కొలతలు ప్రత్యేకంగా ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో బౌలర్లు మైదాన కొలతల గురించి ఆందోళన చెందకుండా తమ ప్రణాళికలపై దృష్టి పెట్టాలని సూచించినట్లు మోర్కెల్ చెప్పాడు. పిచ్, వాతావరణం, ఫీల్డింగ్ అమరికలను అంచనా వేసి సరైన ప్రాంతాల్లో బంతులు వేయడం విజయానికి కీలకమని వివరించాడు.భారత బౌలర్లు పరిస్థితులకు చక్కగా అలవాటు పడి తమ వ్యూహాలను సమర్థంగా అమలు చేస్తున్నారని ప్రశంసించాడు. సమష్టి కృషి, వ్యక్తిగత శిక్షణ, పక్కా ప్రణాళికలే భారత పేస్ బౌలింగ్ విజయానికి ప్రధాన కారణాలని మోర్కెల్ అభిప్రాయపడ్డాడు.

## బాల్ ట్యాంపరింగ్ వివాదంపై ఉస్మాన్ ఖవాజా సంచలన వ్యాఖ్యలు!

**- 2018 శాండ్‌పేపర్ ఉదంతంలో జట్టు మొత్తానికి తెలుసు.. ముగ్గురిపైనే నింద మోపారని వెల్లడి**



ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేసిన 2018 శాండ్‌పేపర్ వివాదంపై మాజీ క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా సంచలన ఆరోపణలు చేశాడు. దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్‌లో జరిగిన టెస్టులో బంతి ఆకారాన్ని మార్చేందుకు శాండ్‌పేపర్ ఉపయోగించిన ఘటనలో ఆస్ట్రేలియా జట్టు మొత్తానికి తెలిసిన విషయమేనని పేర్కొన్నాడు. కేవలం బ్యాటర్లు, బౌలర్లు మాత్రమే కాకుండా సహాయక సిబ్బందికి కూడా ఈ విషయం తెలుసని తన తాజా ఆత్మకథ లిసబ్రిలిలో వెల్లడించినట్లు తెలిపాడు.**ముందు టెస్టులోనూ శాండ్‌పేపర్ వాడకం!**2018లో దక్షిణాఫ్రికా పర్యటన సందర్భంగా పోర్ట్ ఎలిజబెత్‌లో జరిగిన రెండో టెస్టులోనే బంతి స్వభావాన్ని మార్చేందుకు శాండ్‌పేపర్ ఉపయోగించాలనే చర్చ జరిగిందని ఖవాజా వెల్లడించాడు. ఆ సమయంలో బంతిని స్వింగ్ చేయించేందుకు వివిధ మార్గాలపై జట్టు సభ్యులు చర్చించారని, కామెరూన్ బెన్‌క్రాఫ్ట్ స్వయంగా శాండ్‌పేపర్ ఉపయోగించేందుకు ముందుకొచ్చాడని పేర్కొన్నాడు. అనంతరం కేప్‌టౌన్ టెస్టులో బెన్‌క్రాఫ్ట్ శాండ్‌పేపర్‌తో బంతిని రుద్దుతున్న దృశ్యాలు కెమెరాలకు చిక్కడంతో ఈ వివాదం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.**ముగ్గురిపైనే చర్యలు.. ఖవాజా ప్రశ్నలు**ఈ ఘటనపై క్రికెట్ ఆస్ట్రేలియా నిర్వహించిన విచారణలో అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్, కామెరూన్ బెన్‌క్రాఫ్ట్‌లకే ప్రధాన బాధ్యత ఉందని తేల్చింది. స్మిత్, వార్నర్‌లపై ఏడాది నిషేధం విధించగా, బెన్‌క్రాఫ్ట్‌పై తొమ్మిది నెలల నిషేధం విధించింది. అయితే జట్టు మొత్తానికి బాధ్యత ఉందని తాను అప్పుడే చెప్పానని ఖవాజా పేర్కొన్నాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో అందరూ సమష్టిగా బాధ్యత తీసుకోవాలని సూచించినా, చివరకు ముగ్గురిపైనే నింద పడిందని ఆవేదన వ్యక్తం చేశాడు.**విచారణలో తనను ఎందుకు పిలవలేదు?**కేప్‌టౌన్ టెస్టులో బెన్‌క్రాఫ్ట్ పక్కనే కూర్చున్నప్పటికీ క్రికెట్ ఆస్ట్రేలియా విచారణ అధికారులు తనను ఒక్కసారి కూడా ప్రశ్నించలేదని ఖవాజా వెల్లడించాడు. తనకు తెలిసిన విషయాలు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ విచారణకు పిలవకుండానే శిక్షలు ఖరారు చేశారని పేర్కొన్నాడు. ఎనిమిదేళ్ల తర్వాత కూడా అసలు విషయాలు బయటకు రాకపోవడంతో ఇప్పుడు మాట్లాడాల్సి వచ్చిందని తెలిపాడు.**క్రికెట్ ఆస్ట్రేలియా స్పందన**ఖవాజా ఆరోపణలపై క్రికెట్ ఆస్ట్రేలియా స్పందిస్తూ, 2018లో నిర్వహించిన విచారణ ఫలితాలపై తమకు ఇప్పటికీ విశ్వాసం ఉందని ప్రకటించింది. అందుబాటులోకి వచ్చిన సమాచారాన్ని పరిశీలించామని, కొత్త ఆధారాలు అందితే వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేసింది. మరోవైపు అప్పటి ఆస్ట్రేలియా కోచ్ డారెన్ లెమన్ కూడా జట్టులోని అందరికీ ఈ విషయం తెలుసన్న ఖవాజా వాదనతో విభేదించాడు.ఎనిమిదేళ్ల క్రితం ముగిసినట్లు భావించిన శాండ్‌పేపర్ వివాదం ఖవాజా తాజా వ్యాఖ్యలతో మరోసారి క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. అసలు ఆ ఘటనలో ఎంతమందికి భాగస్వామ్యం ఉంది? విచారణలో అన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయా? అన్న ప్రశ్నలు మళ్లీ తెరపైకి వచ్చాయి.

## న్యూజిలాండ్‌తో టెస్టుకు


# రిషభ్ పంత్ రెడీ!

**- గాయం నుంచి కోలుకున్న టీమిండియా వికెట్ కీపర్.. తొలి టెస్టుకు అందుబాటులోకి వచ్చే అవకాశం**



టీమిండియా స్టార్ వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్ న్యూజిలాండ్‌తో జరగనున్న టెస్టు సిరీస్‌కు సిద్ధమవుతున్నాడు. ఇటీవల ఇరానీ కప్ సందర్భంగా ఎడమ వైపు కండరాల గాయానికి గురైన పంత్ బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చికిత్స, పునరావాస శిక్షణ పొందుతున్నాడు.**నెట్స్‌లో బ్యాటింగ్ సాధన**గాయం నుంచి కోలుకుంటున్న పంత్ ఇటీవల నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఎలాంటి అసౌకర్యం లేకుండా బ్యాటింగ్ చేస్తూ కనిపించాడు. దీంతో అతడు త్వరలోనే పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడనే ఆశలు వ్యక్తమవుతున్నాయి. నవంబర్ 9న ఫిట్‌నెస్ పరీక్షకు హాజరుకానున్నట్లు సమాచారం. అందులో ఉత్తీర్ణుడైతే న్యూజిలాండ్‌కు బయలుదేరనున్నాడు.**నవంబర్ 19 నుంచి తొలి టెస్టు**భారత్, న్యూజిలాండ్ మధ్య రెండు టెస్టుల సిరీస్ జరగనుంది. తొలి టెస్టు నవంబర్ 19 నుంచి వెల్లింగ్టన్‌లో ప్రారంభం కానుంది. పంత్ అందుబాటులోకి వస్తే భారత జట్టు బ్యాటింగ్‌తోపాటు వికెట్ కీపింగ్ విభాగానికి బలం చేకూరనుంది. అయితే తుది నిర్ణయం ఫిట్‌నెస్ పరీక్ష అనంతరమే వెలువడనుంది.

## జనవరి 23న నీరజ్‌పెటిస్ బాక్సింగ్ సమరం



భారత్ వేదికగా వచ్చే ఏడాది జనవరి 23న స్టార్ బాక్సర్ నీరజ్ గోయట్, యూఎఫ్‌సీ మాజీ ఛాంపియన్ ఆంథోనీ 'షోటైమ్' పెటిస్ తలపడనున్నారు. ఆరు రౌండ్ల సూపర్ వెల్టర్‌వెయిట్ విభాగంలో ఈ పోటీ జరగనుంది. హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై నగరాలు ఆతిథ్యం కోసం పోటీలో ఉన్నాయి. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఇద్దరు బాక్సర్లు తొలిసారి ముఖాముఖిగా కలుసుకున్నారు. ఎంవీపీ సహ వ్యవస్థాపకుడు జేక్ పాల్ వీడియో సందేశంలో చెన్నైలో పోటీ నిర్వహించాలని ఆకాంక్షించారు.

## న్యూజిలాండ్ 134 పరుగులకే ఆలౌట్

**• గుర్నూర్ బ్రార్‌కు నాలుగు వికెట్లు • వర్షం కారణంగా డీఎల్ఎస్ పద్ధతిలో భారత్‌కు 4 పరుగుల విజయం**





హైదరాబాద్: న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరిగిన రెండో వన్డేలో టీమిండియా డక్‌వర్త్ లూయిస్ (డీఎల్ఎస్) పద్ధతిలో నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించింది. వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్ 47 ఓవర్లకు కుదించారు. తొలుత టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకోగా, భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి కివీస్‌ను 41 ఓవర్లలో 134 పరుగులకే కట్టడి చేశారు. డారిల్ మిచెల్ (55) అర్ధశతకంతో రాణించగా, మిగతా బ్యాటర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ నాలుగు వికెట్లతో సత్తా చాటగా, అర్ష్‌దీప్ సింగ్, ఆకిబ్ నబీ కీలక వికెట్లు పడగొట్టారు. 135 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభం నుంచే ఎదురుదెబ్బలు తగిలాయి. శుభ్‌మన్ గిల్ పరుగులేమీ చేయకుండా వెనుదిరగగా, విరాట్ కోహ్లీ ఏడు పరుగులకే ఔటయ్యాడు. రోహిత్ శర్మ 23 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. వరుసగా వికెట్లు పడటంతో భారత్ కష్టాల్లో పడింది. ఈ సమయంలో కేఎల్ రాహుల్ (26) జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. అయితే 26 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసిన దశలో వర్షం మళ్లీ అంతరాయం కలిగించింది. అప్పటికి భారత్ డీఎల్ఎస్ పద్ధతిలో నిర్దేశిత పార స్కోరు 109 పరుగులకంటే నాలుగు పరుగులు ముందుంది. వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్ కొనసాగించడం సాధ్యం కాలేదు. దీంతో డీఎల్ఎస్ నిబంధనల ప్రకారం భారత్ నాలుగు పరుగుల తేడాతో విజేతగా నిలిచింది

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# చిరంజీవి 'కాకా'పై పుకార్లకు చెక్..

## సంక్రాంతికి రిలీజ్ పక్కా: కోన వెంకట్



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'కాకా' విడుదలపై గత కొద్దిరోజులుగా నెలకొన్న సందిగ్ధతకు ప్రముఖ రచయిత కోన వెంకట్ తనదైన శైలిలో తెరదించారు. సినిమా సంక్రాంతికి రావడం లేదంటూ వస్తున్న వదంతులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ ఘాటైన పోస్ట్ చేశారు."'కాకా' సినిమాపై వస్తున్న అన్ని పుకార్లకు, నిరాధార కథనాలకు ఇక సెలవు. మిమ్మల్ని నిరాశపరుస్తున్నందుకు క్షమించండి, కానీ మేము జనవరి 13న ల్యాండ్ అవుతున్నాం. సంక్రాంతికి 'కాకా' వస్తున్నాడు, అసలైన పండగ తెస్తున్నాడు" అని కోన వెంకట్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ ఒక్క ప్రకటనతో సినిమా విడుదల తేదీపై ఉన్న అనుమానాలకు ఆయన పూర్తిస్థాయిలో చెక్ పెట్టారు. చిరంజీవి హీరోగా దర్శకుడు బాబీ సారథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో అనశ్వర రాజన్, నివేదా పేతురాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చిత్రబృందం ఒకేసారి చిత్రీకరణ, డబ్బింగ్ పనులను సమాంతరంగా జరుపుతూ సినిమాను వేగంగా పూర్తి చేస్తోంది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను కూడా పంచుకుని, పనులు ఎంత వేగంగా సాగుతున్నాయో తెలియజేసింది.

వచ్చే ఏడాది సంక్రాంతి బరి హోరాహోరీగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే వెంకటేశ్, కల్యాణ్ రామ్ నటిస్తున్న చిత్రాన్ని అనిల్ రావిపూడి దర్శకత్వంలో జనవరి 12న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు సూపర్ స్టార్ రజినీకాంత్ 'ధర్మన్' సినిమాతో పాటు మరికొన్ని చిత్రాలు కూడా ఇదే పండక్కి పోటీ పడనున్నాయి. ఈ నేపథ్యంలో 'కాకా' రాకను చిత్రబృందం ధృవీకరించడం ఇండస్ట్రీలో ఆసక్తిని రేకెత్తిస్తోంది


# కీరవాణి ఇంట శుభకార్యం..

## ఘనంగా కుమారుడి నిశ్చితార్థం!



టాలీవుడ్‌లో మరోసారి పెళ్లి బాజాలు మోగబోతున్నాయి. ఆస్కార్ విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి కుటుంబంలో శుభకార్యం జరిగింది. ఆయన పెద్ద కుమారుడు, యువ గాయకుడు, సంగీత దర్శకుడు కాలభైరవ వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. 'బలగం' సినిమాతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ హీరోయిన్ కావ్య కల్యాణ్‌రామ్‌తో ఆయన నిశ్చితార్థం జరిగింది. అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ వేడుకను నిరాడంబరంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.ఈ నిశ్చితార్థ వేడుకకు ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, ఆయన భార్య రమా రాజమౌళి హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. సంప్రదాయ దుస్తుల్లో కాలభైరవ, కావ్య ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎంతో ప్రైవేట్‌గా జరిగిన ఈ వేడుకకు సంబంధించిన చిత్రాలు బయటకు రావడంతో అభిమానులు, సినీ ప్రముఖులు నూతన జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.కాలభైరవ తన తండ్రి బాటలో సంగీత ప్రపంచంలోకి అడుగుపెట్టి గాయకుడిగా, సంగీత దర్శకుడిగా తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. మరోవైపు కావ్య కల్యాణ్‌రామ్ బాలనటిగా కెరీర్ ప్రారంభించి, 'మసూద', 'బలగం' వంటి చిత్రాలతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ముఖ్యంగా 'బలగం' చిత్రంలోని ఆమె నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. ఇరు కుటుంబాల అంగీకారంతో జరగనున్న వీరి వివాహాన్ని డిసెంబర్‌లో ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పెళ్లి తేదీ, వేదిక వంటి పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. కాగా, ఇటీవలే సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ తన ప్రేయసితో నిశ్చితార్థం చేసుకున్నారు. హీరో తేజ సజ్జా కూడా త్వరలో పెళ్లి చేసుకోబోతున్నాడనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఇప్పుడు కాలభైరవ, కావ్యల పెళ్లి వార్తతో టాలీవుడ్‌లో పెళ్లిళ్ల సందడి నెలకొంది.






# 'రామాయణ'పై రకుల్ ప్రీత్ సింగ్ భావోద్వేగం

బాలీవుడ్ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించిన 'రామాయణ' చిత్రం నవంబర్ 6న విడుదలై మంచి ప్రేక్షకాదరణ పొందుతోంది. ఈ సినిమాలో కీలకమైన శూర్పణఖ పాత్రను నటి రకుల్ ప్రీత్ సింగ్ పోషించారు. తాజాగా ఈ పాత్రలో నటించడంపై తన అనుభవాలను, సంతోషాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు."శూర్పణఖ పాత్ర పోషించడం నా జీవితంలో ఒక ప్రత్యేకమైన ప్రయాణం. భారతీయ సంస్కృతిలో భాగమైన రామాయణాన్ని ఇంత భారీ స్థాయిలో వెండితెరపై ఆవిష్కరించడం అద్భుతమైన అనుభూతినిచ్చింది" అని రకుల్ పేర్కొన్నారు. ఈ గొప్ప ఆలోచనను కార్యరూపంలో పెట్టిన దర్శకుడు నితీశ్ తివారీ, నిర్మాత నమిత్ మల్హోత్రాకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచానికి భారత్ నుంచి ఓ అద్భుతమైన చిత్రాన్ని అందించాలన్న వారి తపన తనకు స్ఫూర్తినిచ్చిందని వివరించారు.ఈ సినిమాలో తన సహనటులైన రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, రవిదూబే, కాజల్ అగర్వాల్‌తో పాటు చిత్ర యూనిట్ మొత్తానికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా, రోజూ నాలుగు గంటల పాటు శ్రమించి తనను శూర్పణఖగా సిద్ధం చేసిన కాస్ట్యూమ్ బృందాల కృషిని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది కేవలం ఒక సినిమా మాత్రమే కాదని, ఒక భారతీయురాలిగా తాను ఎంతో గర్వపడే క్షణం అని రకుల్ తన పోస్టులో ఉద్వేగంగా రాసుకొచ్చారు.

# సురేఖ వాణి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ హ్యాక్..

## ప్రైవేట్ కంటెంట్ వైరల్ కావడంతో నటి ఆగ్రహం!




ప్రముఖ తెలుగు నటి సురేఖ వాణి సోషల్ మీడియా ఖాతా హ్యాకింగ్‌కు గురైంది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను హ్యాక్ చేసిన కొందరు దుండగులు, ఆమెకు సంబంధించిన వ్యక్తిగత కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ చేయడంతో ఈ విషయం కలకలం రేపింది. ఈ అనూహ్య పరిణామంపై సురేఖ వాణి తీవ్రంగా స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు.తన సోషల్ మీడియా ఖాతా హ్యాక్ అయిందని, దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు తన ప్రైవేట్ కంటెంట్‌ను దుర్వినియోగం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వ్యూస్, లైక్స్ కోసం బాధ్యతారహితంగా ప్రవర్తించవద్దని మీడియా సంస్థలకు, యూట్యూబ్ ఛానెళ్లకు, మీమ్ పేజీలకు ఆమె సూచించారు. తన వ్యక్తిగత కంటెంట్‌ను షేర్ చేయడం లేదా రీపోస్ట్ చేయడం వెంటనే ఆపేయాలని స్పష్టం చేశారు.ఇది తన వ్యక్తిగత గౌరవానికి సంబంధించిన సున్నితమైన విషయమని, దీన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదని సురేఖ వాణి స్పష్టం చేశారు. తన హెచ్చరికలను బేఖాతరు చేసి ఎవరైనా ప్రైవేట్ కంటెంట్‌ను ప్రచారం చేస్తే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు సదరు కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని, తన ప్రైవసీని గౌరవించాలని ఆమె అందరికీ విజ్ఞప్తి చేశారు.

# పదేళ్ల వయసులోనే గొప్పగా ఊహించుకున్నా..



ప్రముఖ మలయాళీ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అందం, అభినయంతో.. అద్భుతమైన నటనతో ఆడియన్స్ ను ఆకట్టుకుంటూ విపరీతమైన ప్రజాధారణ సొంతం చేసుకుంది . మలయాళం ప్రేమమ్ సినిమాతో ఇటు తెలుగు ప్రేక్షకులను కూడా పలకరించిన ఈమె.. తొలిసారి త్రివిక్రమ్ దర్శకత్వంలో సమంత, నితిన్ కాంబినేషన్లో వచ్చిన 'అ ఆ' చిత్రంలో సెకండ్ హీరోయిన్ గా నటించి, తన అద్భుతమైన నటనతో ఆడియన్స్ లో అటెన్షన్ క్రియేట్ చేసింది. ఆ తర్వాత శర్వానంద్ హీరోగా నటించిన 'శతమానం భవతి' సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది అనుపమ. శ్రీశం =ఘఎ – 'వారణాసి' చేస్తూ ఈ ప్రయోగం ఎందుకు పీసీ? ఆ తర్వాత పలు చిత్రాలు చేసినా ఈమెకు పెద్దగా సక్సెస్ రాకపోవడంతో కొంతకాలం ఇండస్ట్రీకి బ్రేక్ ఇచ్చి.. మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే రీ ఎంట్రీలో భాగంగా గ్లామర్ తో ఆకట్టుకోవడమే కాకుండా బోల్డ్ పాత్రలు కూడా చేసి మెప్పించింది అనుపమ. అలాంటి ఈమె ఇటీవల కిష్కింధపురి, పరదా, బైసన్ వంటి చిత్రాలలో నటించింది. సాధారణంగా ఇన్ని రోజులు రూమర్స్ కి దూరంగా ఉన్న అనుపమ పరమేశ్వరన్.. బైసన్ సినిమా సమయంలోనే ఆ చిత్ర హీరో, ప్రముఖ హీరో కొడుకు, యంగ్ హీరోతో ప్రేమలో పడినట్లు, ఆ తర్వాత ఏమైందో తెలియదు కానీ ఇద్దరి మధ్య బ్రేకప్ అయినట్లు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వినిపించిన విషయం తెలిసిందే. అయితే ఆ రూమర్లపై అనుపమ పరమేశ్వరన్ స్పందించలేదు. కానీ తన సినిమా ప్రమోషన్స్ లో భాగంగా రెండేళ్ల పాటు తాను టాక్సిక్ రిలేషన్ లో ఉన్నాను అని చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది. ప్రేమ అంటే ఒకరి స్వతంత్రాన్ని లాగేసుకోవడం కాదు అని చెప్పిన అనుపమ.. రెండేళ్లపాటు తాను నరకం చూసానని చెప్పుకొచ్చింది. అంతేకాదు తాను ప్రేమలో పడకముందు పెళ్లి చేసుకొని,చాలామంది పిల్లలను కణాలని కలలు కన్నట్లు చెప్పుకొచ్చిన ఈమె.. అతడితో రిలేషన్ బ్రేకప్ తర్వాత అసలు ప్రేమ, పెళ్లి , పిల్లలు అంటేనే భయమేస్తోంది అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. మె.. ఇటీవలే క్రేజీ కల్యాణం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే ఇప్పుడు మరోసారి శర్వానంద్ తో కలిసి భోగి సినిమాలో నటిస్తోంది. ఇదిలా ఉండగా.. అనుపమ సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్ గా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతం తన సినిమా షూటింగ్ లతో బిజీగా ఉంటూనే .. ఇటు ఖాళీ సమయం దొరికితే చాలు పలు రీల్స్ చేస్తూ సందడి చేస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా షేర్ చేసిన ఒక వీడియో సోషల్ మీడియాలో ఆకట్టుకుంటుంది. అద్భుతం ఆవిష్కారం సూర్య, భూమిక కాంబినేషన్లో వచ్చిన నువ్వు నేను ప్రేమ సినిమాలోని "ప్రేమించే ప్రేమవా" అనే మ్యూజిక్ ను షేర్ చేస్తూ.. ఒక గేటు పట్టుకొని సరదాగా ఆ మ్యూజిక్ ని ఫీల్ అవుతున్నట్లు ఆ వీడియోని షేర్ చేసింది. పైగా ఈ వీడియోకి క్యాప్షన్ గా.."పదేళ్ల వయసులోనే నేను, సన్ మ్యూజిక్ కి అతుక్కుపోయి.. ఈ పాటను పదేపదే వింటూ ప్రేమ, శృంగారం ఎలా ఉంటాయో ఊహించుకొనే దాన్ని" అంటూ చెప్పుకొచ్చింది . మొత్తానికైతే ఈ క్యాప్షన్ కాస్త వైరల్ కావడంతో ఇది చూసిన నెటిజన్స్.. పదేళ్ల వయసులోనే ఎన్నో ఊహించుకున్న ఈమె.. ఇప్పుడు యుక్త వయసుకు వచ్చాక అతడి కారణంగా ప్రేమ అంటేనే భయపడే స్టేజ్ కి చేరుకుందా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా అనుపమ షేర్ చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613